తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

అక్టోబర్-2024

వెల: ₹20

## దీపావళి ప్రత్యేక సంచిక

జ్యోతిష్యం, వాస్తు


కార్టూన్ పోటీ ఫలితాలు



THE LARGEST CIRCULATED TELUGU WEEKLY AND MONTHLY

సపరివార పత్రిక

# స్వాతి




# 39.59 లక్షలు

SARA'SWATI' NAMASTHUBHYAM



**కలియుగ ప్రత్యక్ష దైవం**

**శ్రీ వేంకటేశ్వర స్వామి లీలలు...**

**డా॥ కె.వి. రమణాచారి గారి**

(పూర్వ కార్యనిర్వహణాధికారి, టి.టి.డి)

**అనుభవాల సమాహారం...**

**హరే...శ్రీనివాసా!**

**ధారావాహిక చదవండి!**



తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

జీ'వనం'లో నవ్వు నవ వసంతం

అక్టోబర్-2024

21వ సంవత్సరం
244 వ సంచిక

ముఖచిత్రం: దిగంగణ సూర్యవంశీ ✦ కార్టూన్: గోపాలకృష్ణ

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9 8 4 9 6 3 0 6 3 7**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
Dayakar, Gandhi, Nagisetty, Bomman
GopalKrishna, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya

*Publisher& Editor-*
*Ramu.P*

*Well Wishers:*

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*

K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
G.Venkat Reddy

| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో) | 2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9 8 4 9 6 3 0 6 3 7**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు


| | | |
|---|---|---|
| టపాసుల టపటప! పటాసుల పటపట! | -కంద్లకుంట శరత్‌చంద్ర | -22 |
| నాక్కావలసింది...నీ దగ్గర ఉంది! | -నాగమంజరి గుమ్మా | -25 |
| ఫిట్టింగ్ పంకజం | -పేట యుగంధర్ | -28 |
| పారాచూట్ | -ఆర్.సి.కృష్ణస్వామిరాజు | -34 |
| సుగంధ పరిమళాలు | -దినవహి సత్యవతి | -40 |
| ఇంటింటికో చెత్తకుండీ | -పోపూరి విశ్వనాథ్ | -42 |
| ముల్లుని ముల్లుతో... | -వీరేశ్వరరావు మూల | -46 |


## స్పెషల్స్


| | | |
|---|---|---|
| జ్యోతిషం, వాస్తు కార్టూన్ పోటీ ఫలితాలు | | -12 |
| దసరా సరదాలు | | -17 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| వాక్చిత్రం | -సుధామ | -15 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -32 |
| స్టైల్ స్టార్స్ | -రామ్‌శేషు | -26 |
| వెనక్కి వెళ్ళే కథలు | -వడ్లమన్నాటి గంగాధర్ | -38 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


## సీరియల్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -18 |


## కార్టూన్ శీర్షికలు




| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -20 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -21 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -30 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -37 |
| నవ్వేమందు | -ప్రసిద్ధ | -45 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -48 |
| కా.కా.క.క. | -బాచి | -49 |














## ఈ సంచికలో కార్టూనిస్టులు

- ✦ జయదేవ్
- ✦ సరసి
- ✦ గోపాలకృష్ణ
- ✦ శర్మ
- ✦ బాచి
- ✦ శేఖర్
- ✦ రామ్‌శేషు
- ✦ గాంధీ
- ✦ నాగిశెట్టి
- ✦ కృష్ణ
- ✦ గౌతమ్
- ✦ ప్రసాద్ కాజ
- ✦ జాకీర్
- ✦ రవీంద్ర
- ✦ కె.వి.భవాని
- ✦ ప్రసిద్ధ
- ✦ చక్రవర్తి
- ✦ ఓంకార్
- ✦ శివ
- ✦ భాను
- ✦ బొమ్మన్
- ✦ కామేష్
- ✦ అరుణ్
- ✦ శేషయ్య
- ✦ గుత్తుల శ్రీనివాస్
- ✦ దాస్
- ✦ బీవీఎస్
- ✦ సునీల్
- ✦ శ్రీకర్
- ✦ పద్మ
- ✦ టి.ఆర్.బాబు
- ✦ ఎమ్.ఎమ్.మురళి
- ✦ కాశ్యప్
- ✦ పి.వి.నాయుడు
- ✦ కాశ్యప్
- ✦ తోపల్లి ఆనంద్
- ✦ డేవిడ్
- ✦ వందనశ్రీనివాస్
- ✦ సాధన

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...సన్నిహితులకు**
**దసరా, దీపావళి శుభాకాంక్షలు!**

**ప**ండుగలు మన సంస్కృతికి పట్టుకొమ్మలు! ప్రతి పండుగకి ఒక కథ ఉంటుంది.
ఒక ప్రయోజనముంటుంది... మనమేంటో ఈ పండుగలు చెబుతాయి.
ఈ నెలలో రెండు పండుగలు మనకొస్తున్నాయి.
మన పండుగల పరమార్థం చెడుపై మంచి గెలవడం!
ఎంతటి బలవంతులైన అధర్మం చేస్తే మట్టిలో కలిసిపోతారు అనే సాక్ష్యాలు కోకొల్లలు!
నీతిమాలిన పనులు చేస్తే శిక్ష అనుభవించక తప్పదని చాటి చెప్పడమే కాకుండా...
నీతిగా బ్రతకమని హెచ్చరిస్తాయి మన పండుగలు.
మహిషాసురుని వధ 'దసరా'గా మనం జరుపుకుంటుంటే... నరకాసురుణ్ణి నరకానికి పంపినందుకు 'దీపావళి' మన పండుగయింది. ఇలాంటి కథలు విని, వాటి మూలంగా ఏర్పడిన ఈ సంబరాలు... చేస్తున్న మనం ఎంత 'నీతి'గా ఉంటున్నాం అని మనల్ని మనం ప్రశ్నించుకుందాం! రోజూ వార్తల్లో సిగ్గులేకుండా నీతిమాలిన పనులను చేస్తున్న వారిని చూసి మనం ఏం చేయకూడదో నేర్చుకుందాం! అలాంటి జీవన విధానం ప్రశాంతంగా ఉండదనేది సత్యం! అందరి కళ్ళు కప్పి చేసే 'అకృత్యాలు' మనకి తెలియక పోవచ్చు కానీ... సర్వవ్యాపితమైన జగన్మాత నుండి తప్పించుకోగలరా?!
ఈ విజయదశమిసందర్భంగా అమ్మని ఇలా ప్రార్థిద్దాం...
**'అమ్మా!... నిజాయితీగా బ్రతికే ఏ ఒక్కడ్ని చిరునవ్వు నుంచి దూరం చేయకు!'** అని.
కుటుంబ సభ్యులందరు కలిసి 'పండుగ' చేసుకుంటే ఆ 'ఆనందమే' వేరు.
నేటి గజిబిజి జీవనవిధానంలో అప్పుడప్పుడు వచ్చే పండుగలకి అందరు కలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. దీని వలన బంధాలు, బంధుత్వాలు బలపడడమే కాకుండా, ఒక ఆరోగ్యకరమైన వ్యవస్థలో భాగస్వాములవుతాము.

ఆనందానికి ప్రతీకలైన మన పండుగలని వీలు 'చూసుకుని' కాకుండా వీలు 'చేసుకుని' జరుపుకుందాం! ఆనందాన్ని మన స్వంతం చేసుకుందాం!
అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....



## రీసౌండ్

✦ **తూలుగు రమణారావు, శ్రీకాకుళం**

**వి**నాయకుని ముఖచిత్రంతో వెలువడిన సెప్టెంబర్ హాస్యానందం సంచిక చాలా బాగుంది. కథలు, ఆ కథలకు వేసిన బొమ్మలు బావున్నాయి. 'నా సబ్బు రహస్యం' కథ చాలా ఇళ్ళల్లో నడుస్తున్న కథ. కొంగుచాటు కృష్ణుడు సీరియల్ నెలనెలా అలరిస్తున్నాడు. చక్కని కార్టూన్లతో మా ఇంటిల్లిపాది ఆనందించాం. ఇలాగే నిరంతరం తెలుగు పాఠకులకు నవ్వులు పంచాలని కోరుకుంటున్నాము.



✦ **బి. సూర్యనారాయణ, విశాఖపట్టణం**

**హా**స్యం కరువవుతున్న ఈ రోజుల్లో 'హాస్యానందం' లాంటి హాస్య పత్రికను నడపడము మాలాంటి వారికి సంతోషదాయకం. మీలాంటి సంపాదకులుకు 'కత్తిమీద సాము'. నవ్వడానికి కూడా ఆలోచిస్తున్న ఈ రోజుల్లో 'హాస్యానందం' మాలాంటి వారికి నిజంగా వరప్రసాదం. నూరేళ్ళ జీవితానికి అవసరమైన హాస్యంలాగే మీ పత్రిక కూడా 'నూరేళ్ళ'పాటు వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

✦ **పి.వి. శ్రీనివాస్ శ్రీలేఖ, సికింద్రాబాద్**

**త**నికెళ్ళ భరణి గారికి గౌరవ డాక్టరేట్ అందుకున్నందుకు అభినందనలు. తనికెళ్ల భరణి మరియు హాస్యానందం ఇప్పటికే ఇద్దరు డాక్టర్లు! 'ఇద్దరూ ఇద్దరే'! మంచి హాస్యంతో నవ్వించి మంచి ఆరోగ్యం చేకూర్చే డాక్టర్(లు). ప్రతి నెలా సంచికలో కొత్తదనం ఉట్టిపడే కార్టూన్లు-హాస్యం చేతల్లో చూపిస్తున్న 'హాస్యానందం' సంపాదకులకు (పి.రాము బృందానికి) ధన్యవాదాలు. అసభ్యత లేకుండా విఘ్నేశ్వరుడుపై కార్టూన్లు చకితం-చిరునవ్వు రెండూ తెప్పించాయి. '8' కార్టూన్లకు ప్రతినెలా మీ ప్రోత్సాహ నిర్వహణకు హ్యాట్సాఫ్. ప్రపంచం మీలా అవార్డ్స్-రివార్డ్స్ సంతోషపూరిత నిర్వహణ నేర్చుకోవాలి. ఆచరించాలి. 'తెలుగా మజాకా' (రామకృష్ణ) శీర్షిక తెలుగు మీడియం మరియు తెలుగు విషయం విద్యార్థులు-టీచర్లు ఈ శీర్షిక ప్రతి నెలా చదవాలి అని మా సూచన. హాస్యం నవ్వు-వ్యాకరణ సవరణలతో 'హ్యాట్రిక్' లాభం. వాక్చిత్రం (సుధామ) గారి శీర్షికలో టైటిల్ తో సహా వాక్చిత్రం వెల్లడి అవుతుంది. విద్యాత్మకంగా ఉంటుంది.

✦ **బి.మధులత, ముంబై**

**సె**ప్టెంబరు హాస్యానందం సర్వాంగ సుందరంగా ముస్తాబైన తీరు ప్రశంసనీయం. హాయ్...సానందంగా నుండి పదానందం వరకు ఎక్కడా అసభ్యం లేకుండా...హాస్యం, అపహాస్యం కాకుండా పత్రికని మీరింత చక్కగా నిర్వహిస్తున్నందుకు మా అభినందనలు.






గిడుగు జయంతి వేడుకలు సందర్భంగా... కళా రంగానికి చేస్తున్న సేవకు గుర్తింపుగా-

**గిడుగు జాతీయ కళా రంగ పురస్కారం**

ప్రముఖ ఆర్టిస్ట్, కార్టూనిస్ట్ **శ్రీ బొమ్మన్‌గారు** అందుకున్నారు. గిడుగు రామమూర్తి ఫౌండేషన్ వారు ది.29-8-2024 న విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ఈ పురస్కారం అందించారు.



డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో


# గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ



శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను
ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.
కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

## 10 బహుమతులు
## ఒకోక్కటి 3000 రూపాయలు

**మెమొంటో + సర్టిఫికెట్**



**కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2024**
**ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-**
**hasyanandampoteelu@gmail.com**

### నిబంధనలు

- ✦ 'అంశం' ఏదైనా ఫరవాలేదు గానీ నవ్వు పుట్టించేలా కార్టూన్లు ఉండాలి. దయచేసి అశ్లీల అంశాల జోలికెళ్ళొద్దు!
- ✦ పోటీలో పాల్గొనే కార్టూనిస్టులు, తాము పంపే మెయిల్‌లో పేరు, ఫోన్ నెంబరు తప్పని సరిగా ఉండాలి!
- ✦ పాకెట్ సైజు కార్టూన్లు పంపవద్దు.
- ✦ బహుమతి ప్రదానోత్సవ సభ **ఫిబ్రవరి 2025 లో హైదరాబాదులో జరుగుతుంది.** వివరాలు ఫిబ్రవరి హాస్యానందంలో ప్రచురిస్తాం!



## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

**4000 రూపాయల బహుమతులు**


మన కార్టూనిస్ట్లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




'కార్టూన్ మిత్ర'

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**

**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీమతి నమ్మి మధుబాల**

**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**

కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


- మొదటి బహుమతి- **రూ.500/-లు**
- రెండవ బహుమతి- **రూ.300/-లు**
- మూడవ బహుమతి- **రూ.200/-లు**






కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
***తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ***
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**"మా**స్టారూ... మాస్టారూ... మిమ్మల్ని హెడ్ మాస్టారు ఉన్న పళాన రమ్మన్నారండీ... అర్జెంట్‌గా రండి మాస్టారూ..." అంటూ పిడుగు పడిన శబ్దంతో గట్టిగా అరిచి... మెరుపుతీగలా మాయమయ్యాడు అటెండర్ ఏకాంబరం.

ఏంటి విషయం?... అని అడగాలన్న ఆలోచన నా మెదడు నుంచి నోటికి దగ్గరకు వచ్చే సమయం కూడా అతగాడక్కడ నిలబడలేదు.

ఏకాంబరం వేసిన ఆర్డర్ స్థాయికి అటెండర్ ఎవరో... హెడ్ మాస్టర్ ఎవరో అర్థం కాని పరిస్థితి.


ఫ్చ్!... కంప్యూటర్ కాలం... అనుకుని తమాయించుకున్నాను. అయినా, హెడ్ మాస్టారు అంత తొందరగా రమ్మన్నారంటే ఏదో పెద్ద విషయమే అయి ఉంటుంది... అనుకుంటూ క్షణం ఆలస్యం చేయకుండా బయల్దేరాను.



నిప్పుల్లో కాలిన ఇనుపగుండులా హెచ్.ఎం గారి ముఖం ఎర్రబడి ఉంది. ఘోషయాత్రలో జరిగిన భంగపాటు వల్ల అవమానభారంతో కుమిలిపోతున్న దుర్యోధనుడిలా దీనవదనంతో లెక్కల మాస్టారు హెచ్.ఎం గారికి ఎదురుగా కూర్చున్నారు.

నన్ను చూడటంతోనే... "ఏంటి మాస్టారూ మీరు చేసిన పని! ఇదేం బాగోలేదు... ఇంత పెద్దవారై ఉండి కూడా మీరిలా చేసారంటే నమ్మలేక పోతున్నాను. మీవంటి గురోత్తములు కూడా ఇలా చేయడం మంచి పద్ధతి కాదు మాస్టారూ..." కొద్దిగా కేకలేస్తున్నట్లు మాట్లాడారు హెచ్.ఎం గారు.

"మాస్టారూ...ఏమీ అనుకోకండి.... **గురోత్తములు** అనకూడదు. **గురూత్తములు** అనాలండీ అనగానే ఏనుగుల గుంపు మీదకు దూకిన




సింహంలాగా నా మీదన ఇంతెత్తున ఎగిరారు హెచ్.ఎం గారు.

"ఇదే... ఇదే మీతో వచ్చిన తంటా! మొన్నటికి మొన్న చాముండీశ్వరి టీచర్‌గారి విషయం లోనూ ఇదే తంతు. ఆవిడ పెళ్ళి కార్డు తీసుకువస్తే, కార్డు మీద **కళ్యాణ** శుభలేఖ అని ఉంది. అది తప్పు... **కల్యాణ** అని రాయాలన్నారట. కార్డు లోపల **సాంప్రదాయం** అని ఉంటే అది కూడా తప్పుగా రాసావు అంటూ రెడ్ పెన్ తో దిద్ది మరీ **సంప్రదాయం** అని రాసారట. ఆమె భర్త పేరు దగ్గర **జేష్ఠ** కుమారుడు అని ఉంటే, అది తప్పనీ, **జ్యేష్ఠ** కుమారుడు అని ఉండాలని దిద్దారట... ఏంటి మాస్టారూ!... మీరు చేసిన పనికి ఆవిడ ఎంత బాధపడిందో మీకు తెలియదు. ఆ రోజున ఆమెను స్వాంతన పరిచేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది... ఇలా మీరు

చేస్తున్న పనుల చిట్టా పెరిగిపోతోంది రోజు రోజుకీ..." అంటూ ఎంతో ఆవేశపడ్డారు మాస్టారు.


"ఏకాంబరం! మాస్టారికి చల్లటి మంచినీళ్ళు తీసుకురా!"...అంటూ కేకవేసి...

"నిజమే మాస్టారూ! మీరన్నది నిజమే. కానీ, ఆవిడ పేరు **చాముండీశ్వరి** అని... రాయ కూడదు... పలక కూడదు. **చాముండేశ్వరి** అని మాత్రమే అనాలి... రాయాలి! ఇక, మీరు ఆవిడను **స్వాంతన** పరచే అవకాశం ఏ మాత్రం లేదు. కేవలం **సాంత్వన** పరచగలరు. ఎందుకంటే స్వాంతనం అనే మాట తప్పు. అలా పలక కూడదు. రాయకూడదు కూడా!...

ఇక, కల్యాణం అనేది సంస్కృత పదం. సంస్కృతంలో 'ళ' అనే అక్షరం లేదు. కాబట్టి, తెలుగులో కూడా కేవలం 'కల్యాణం' అని మాత్రమే రాయాలి... కనీసం శుభలేఖ మీద ఆహ్వాన శీర్షిక అయినా తప్పుల్లేకుండా రాయాలి కదా మాస్టారూ! చిన్నవాళ్ళకి మనం చెప్పకపోతే ఎవరు చెబుతారు చెప్పండి..." అంటూ హెడ్‌మాస్టారికి చెప్పాల్సిన వివర మంతా చెప్పాను.

అప్పటికే ఏకాంబరం తెచ్చిన కూల్ వాటర్ బాటిల్ గటగటా తాగేసారు పెద్ద మాస్టారు.

"ఇదయ్యా పరిస్థితి! ఇప్పుడు ఏం చెప్పు కుంటావో... నీ సమస్య ఏమిటో... నువ్వే





ఆయనతో చెప్పుకో!..." అంటూ లెక్కల మాస్టారికి తెగేసి చెప్పారు పెద్ద మాస్టారు... అదే హెడ్ మాస్టారు.

"జరిగినదంతా ప్రత్యక్షంగా చూసాక కూడా ఇంకా ఏం అడుగుతాను మాస్టారూ!" అంటూ భయం భయంగా నా వైపు చూసారు లెక్కల మాస్టారు.

ఆయన ముఖంలో ఇంతకుముందు కని పించిన దీనత్వం స్థానంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆc!...ఇప్పుడు అర్థమైంది మాస్టారూ... లెక్కల మాస్టారి ఆవేదనకు కారణం ఏమిటో? మా అమ్మాయి మనోజ్ఞ క్లాసుకి ఈ మాస్టారే లెక్కలు చెబుతారు... మా అమ్మాయి ఇంటి పని... అదే హోంవర్క్ బుక్ నిన్న చూస్తున్న పుడు అందులో **కనిష్ట** సామాన్య గుణకం, **గరిష్ట** సామాన్య గుణకం అని ఉంటే అలా రాయటం తప్పని, **కనిష్ఠ**, **గరిష్ఠ** అని మాత్రమే రాయాలని చెప్పాను. అలాగే, **సౌష్టవం** అని రాయకూడదు... **సౌష్ఠవం** అని మాత్రమే రాయాలి అంటూ... ఎలా రాయాలో అక్కడే పుస్తకంలో రాసాను. అదే కదా మాస్టారూ..." అంటూ లెక్కల మాస్టారి వైపు చూసేసరికి... ఒకేక్షణంలో ఆయన ముఖంలో వంద భావాలు కనిపించాయి. ఏ ఒక్క ముఖ కవళికకి అర్థం ఏమిటో అర్థం కాలేదు నాకు.

ఇంతలో "శ్రీవారూ..."అంటూ కేక విని పించింది.




అమ్మో! రత్నం బడిక్కూడా వచ్చే సిందా? అనుకుంటుండగానే నా వైపు చూసి ముసిముసి నవ్వులు నవ్వుతున్న ఏకాంబరం కంటపడ్డాడు.

**తరువాత ఏమౌతుందో....**
**వచ్చే సంచికలో...**




హాస్యానందం సౌజన్యంతో


## భారతీయ జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ, అమరావతి వారి సమర్పణలో


## జ్యోతిష్యం, వాస్తు

అంశంగా నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు















## ప్రోత్సాహక బహుమతులు ఒకోక్కరికీ -రూ. 500/-లు




















## ప్రోత్సాహక బహుమతులు ఒకోక్కరికీ -రూ. 500/-లు




# ఆహ్వానము

**అక్షజ్ఞ పబ్లికేషన్స్ ప్రచురించిన**

**కళారత్న శ్రీబన్నంగారు రచించిన 'బాపుగారితో నేను' పుస్తక ఆవిష్కరణ**

**హాస్యానందం సౌజన్యంతో ...**

**భారతీయ జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ, అమరావతి వారు నిర్వహించిన**

**కార్టూన్ పోటీలో బహుమతి పొందిన కార్టూనిస్టులకు బహుమతి ప్రదానం!**

**వేదిక:** తెలంగాణ సారస్వత పరిషత్, బొగ్గులకుంట,హైదరాబాద్

**తేదీ:** 28,అక్టోబర్,2024 ✦ **సమయం:** సాయంకాలం 6గంటలకు




**దీపావళి ఏడాదికి ఒకసారే వస్తుందనుకుంటాం గానీ... నిజానికి నిత్యవ్యవహారంలో మనతో ముడిపడిపోయిన దాని సంగతులు బోలెడున్నాయి! మనం భాషలో వాడుకునే మాటలే దానికి ప్రబల సాక్ష్యాలు మరి!**

"వాడి ముఖం 'మతాబా'లా వెలిగిపోతోంది" అంటాం!...

"వాడు 'జువ్వ'లా దూసుకుపోయాడు" అంటాం.

"తనదో చిచ్చుబుడ్డి ముఖం" అంటాం ఒకరి గురించి.

"అబ్బో తానా! ఒక సీమ టపాకాయ" అంటాం మరొకరి గురించి.

"లక్ష్మీబాంబు పేలినట్టయింది సుమా!" అంటాం ఓ సంఘటన గురించి.

"వాడెప్పుడూ 'చిటపట' లాడు తూంటాడు" అంటాం.

"వాడో పాంబిళ్ళగాడు..." అనడమూ వుంది.

ఇదంతా ఏమిటంటే దీపావళి మనతో పెనవేసుకున్న వైఖరి కాక మరేమిటి చెప్పండి! సరే! సత్యభామతో ఆడవాళ్ళను పోల్చడం వుండనే వుంది. అహానికీ, పట్టుదలకే కాదు అందానికీ, అతిశయానికీ కూడా 'భామా కలాపం!' మనకు తెలిసిందే కదా!

నరకాసురుడు చావడం వల్ల దీపావళి అనుకుంటే... 'నకరాసురులు' చావవలసిన సందర్భాలు ఇంకా అసలు దీపావళి ఆవశ్యకతను ఘోషిస్తూనే వుంటాయి.

'తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరవు' అని ఓ సామెత! అసలు తాటాకు టపాకాయల మోతే అసలు మోత ఒకప్పుడు.




ఇప్పుడంటే దీపావళి టపాసుల దుకాణాలు ఏడాది పొడుగునా హోల్‌సేల్‌గా ఎక్కడో అక్కడ వుంటూనే వున్నాయి. ఎందుకంటే ఇప్పుడు దీపావళికే టపాకాయలు కాల్చుకోవాలనే నియమం లేదుగా!

పెళ్ళి ఊరేగింపులో టపాకాయలు కాలుస్తారు. తారాజువ్వలు విసురుతారు. అంతేనా! ఎన్నికలైపోయి ఫలితాలు ప్రకటించాక విజయగర్వంతో టపాకాయలు కాల్చడం, నాయకుడి ఊరేగింపులో బాజాలతో బాటు జువ్వలు విసరడం, చిచ్చుబుడ్లు కాల్చడం చేసేస్తున్నాం! రోడ్లమ్మట 'థౌజెండ్ వాలా' పేల్చేస్తారు.

అంతెందుకు? ఇండియా పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అయి ఫలితం వెలువడగానే విన్పించేది ఈ టైపు టపాసుల మోతే కదా!

ఏమయినా దీపావళి అంటే దీపాల పండుగ అనేదానికన్నా ఈ టపాకాయల మోత హోరు పండుగగా పిల్లలకూ, యువకులకూ మరీ వేడుక అయిపోయింది మరి!

దీపావళి అనగానే అల్లుళ్ళు ఇంటికి రావడం... బావగారిని ఆట పట్టిస్తూ కొంటే మరదళ్ళు బాంబులు కాల్చమని రెచ్చగొట్టడాలూ బాంబు కాల్చడమే హీరోచితకార్యంగా పరిగణించడం... సంగతి తెల్సిందేగా! సరే దీపావళి పిండివంటల సంగతి సరేసరి!

ఈ మధ్య మిఠాయి దుకాణాల వాళ్ళు స్వీట్స్ కూడా చిచ్చుబుడ్డి ఆకారంలోనో... భూచక్రం ఆకారంలోనో తయారుచేసి అమ్మడం కూడా ఫ్యాషనైపోయింది సుమండీ!

దీపావళి ప్రత్యేక సంచికలంటే అందునా ఒకప్పుడు యువ, జ్యోతి, మాసపత్రికల దీపావళి ప్రత్యేక సంచికలంటే సాహిత్యాభిమానులంతా ఆనందంతో ఎగబడేవారు.

ఆ ప్రత్యేక సంచికల్లో పండుగ



కార్టూన్లు మరీ ప్రత్యేకం.

బాపుగారి 'బంగారం-సింగారం' వంటి బొమ్మల కథలన్నీ దీపావళి ప్రత్యేక సంచికల పుణ్యమే!

అసలు కార్టూనిస్టులకు పండుగ అంటే దీపావళి ప్రత్యేక సంచికే! అలనాటి యువలు, జ్యోతులు, జయశ్రీలు గట్రా మీరు తిరగేస్తే వందలాది కార్టూన్లు కనపడతాయి మనకు. కార్టూన్లు కూడా కొన్ని 'తుస్సు'మనచ్చును కోండి! కానీ ప్రేలేవే శోభాష్!




కేపుల పెట్టె కొనుక్కుని, తుపాకీలో పెట్టి టపటపా కాల్చడం అనేది చిన్నప్పటి దీపావళి సరదా.

దీపావళి టపాకాయలు ఎండబెట్టడం అనేది ఓ స్పెషల్ పని. ఆ రోజుల్లో రూపాయి పెడితేనే కొన్ని టపాసులు వచ్చేవి. ఇప్పుడో! వేలూ, లక్షలూ పెడితే గానీ గొప్ప సంరంభం సాధ్యం కాదు. ఇంత చేసినా కొన్ని 'తుస్సు'మంటాయి. కొన్ని 'ధాం!' అంటాయి.

దీపావళి అంటే బోలెడు సరదా అయిన ఓ పిల్లాడు... పెరిగి పెద్దయి పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరాక ఓ దీపావళి మర్నాడే ఉద్యోగంలో సస్పెండ్ అయ్యాడట!

అంతకుముందు రోజు నగరంలో బాంబు ప్రేలుళ్ళు సంభవిస్తే ఇతను దీపావళి టపాకాయలు అనుకుని ఆ తీవ్రవాదులను గుర్తించ లేకపోవడమే అందుకు కారణమంట! పాపం నిజమే కదా! ఏది దీపావళి బాంబో, ఏది అసలైన బాంబో గుర్తించ లేకపోతే ఆ అధికారి పరిస్థితి అంతేగా మరి!

ఓ చిన్న సీమటపాకాయ వెలిగించ దానికి ఓ పెద్ద కర్రకు చివర కాకరపువ్వొత్తి కట్టి వెలిగించి... అప్పుడు టపాకాయ వత్తికి అంటించడం భీరువు లక్షణమా?... ధీరుల లక్షణమా?... అలాగే తారాజువ్వ వెలిగించి నేరుగా చేతితో వదిలేయడానికీ, ఓ సీసాలో పెట్టి అంటించి పైకి పంపడానికీ వ్యక్తి సాహసంలో బోలెడు తేడా వుందని చెబుతుంది ఈ దీపావళి.

దీపావళికి పండుగ బోనస్ ఇవ్వడం అనేది ఉద్యోగులకు, కార్మికులకూ వర్తిస్తుండే ఒక శుభకార్యమే!

సరే! తెలుగు సినిమాల్లో ఏమిటి? హిందీ సినిమాల్లో ఏమిటి దీపావళి పండుగ సన్నివేశాలు... పాటలు సంగతి మీరెరుగనిదా చెప్పండి! 'చీకటి వెలుగుల రంగేళీ – జీవితమే ఒక దీపావళి' అని ఆత్రేయగారన్నారు.


దీపావళి హాస్యానంద సంభరితమే.

దీపావళి పండుగ నేపథ్యంలో ఎన్నెన్ని కార్టూన్లు వచ్చాయో! ఎందరెందరు వేసారో!

అసలు 'దీపావళి' అనే ఇతివృత్తంపై ఎంపిక చేసిన కార్టూన్లతో ఒక బృహద్గ్రంథమే ప్రచురించవచ్చు.

ఎప్పుడో హాస్యానందం ఆ పనిచేసి నవ్వుల పుణ్యం కట్టుకుంటుందని కూడా మనం ఆశిద్దాం.


అందరికీ దీపావళి శుభాకాంక్షలు.










దసరా
సరదాలు



అల్లుడూ.. పండక్కి నీ మనసుపడ్డ కోరిక తీర్చడానికి నేనేస్తున్న పిచ్చిగంతులు నీకు సూపర్‌గా ఉన్నాయా..
సూపర్... అదుర్స్



ఈ దసరా రోజులంతా ఆ ఛానెల్‌లో యాంకర్ అలాగే న్యూస్ చదువుతాడులే.. ఖంగారు పడకు..!!
LIVE
చక్రవర్తి


మావారు కూడా మామూళ్ళకోసమే వెళ్ళేరు..రేపు రా...రా... అబ్బి...!!
సుబ్బారావు పోస్ట్‌మేన్


నేను నిజంగా, నక్సలైట్‌ని కాదు దసరా వేషగాణ్ణంటే.. వినరేం...!!
గాబరాపడకయ్యా.. నేను దసరా వేషగాణ్ణే..!
భాను


అమ్మవారికి ఒక్క రాక్షసుణ్ణి చంపడానికి ఇన్ని ఆయుధాలు, చేతులూ అవసరమైతే ఇప్పుడున్న రాక్షసులకి!


లిఫ్ట్ రిపేర్‌లో ఉంది.. హమ్మయ్య ఎవరూ దసరా మామూలు కోసం రారులే అనుకున్నారుగా.. ఓ సారిలా రాండి...!!
చక్రవర్తి



కథ-కథనం

యండమూరి వీరేంద్రనాథ్
యర్రంశెట్టి శాయి




# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మథా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొన డానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... ఈలోగా మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. భర్తతో సవాలు చేసి సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా చేస్తున్న ప్రయోగం ఫలించక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. సరస్వతి సృష్టించిన రెండో బొమ్మ గూటాల పల్లి ఆనందరావు. అర్జెంటుగా గది ఖాళీ చేసి వెళ్ళిపొమ్మని ఆ వీధి ప్రజలు అడుగుతుండటంతో పెద్ద సమస్యలో ఉన్నాడు. **ఆ తర్వాత...**



**ఆనందరావు మాటకారి. ఈ విషయం ఒక ఉదాహరణతో మరింత వివరంగా అర్థం చేసుకోవచ్చు. అదే వీధిలోని ఉన్న ఒక ప్రౌఢ తొలి పరిచయంలో అతడిని- "ఈ వీధిలో నిన్ను చాలా రోజుల నుంచీ చూస్తున్నా ఆనందరావ్. ఎందుకీ క్షుద్ర మైన పనులు చేస్తున్నావ్?..." అంటూ మందలించింది.**

"మీరు నెలకోసారి వెళ్ళి పుణ్యక్షేత్రాలు దర్శిస్తారు... వారానికి ఆరు రోజులు పూజలు చేస్తారు. ఎందుకు ఆంటీ?" అని అడిగాడు.

"మనశ్శాంతి కోసం! అలౌకికమైన ఆనందం కోసం!... అంతరంగ సంతోషం కోసం!" కళ్ళు అరమోడ్పులు చేసి అన్నది.

"నిజంగా బావుంటుందా?"

"అనుభవిస్తే గానీ అది తెలీదు ఆనందరావ్. తుచ్ఛ స్నేహాలు చేసే నీలాంటి వారికి అది అస్సలు అర్థం కాదు."

"అమాయకుడిని,అజ్ఞానిని, తెలియక అడుగుతున్నాను ఆంటీ... తుచ్ఛ స్నేహానికీ, పవిత్ర స్నేహానికీ తేడా ఏమిటి? చెప్పరా?" అని అభ్యర్థించాడు.

'తెలియక అడుగుతున్నాను' అంటూ అవతలి వారిని అందలం ఎక్కించటం జిమ్-జామ్ బిస్కెట్.

అతడి అభ్యర్థనకి ఆమెలో జ్ఞాన పర్వతం బ్రద్దలయింది. శ్వాస మీద ధ్యాస నిలిపి- "శరీరానికి సంబంధించినది తుచ్ఛం! మనసుకు సంబంధించింది పవిత్రం... దానికి నిర్వచనం లేదు, ఆకృతి లేదు... అది పైకి కనపడదు. ఇంగ్లీషులో సోల్‌మేట్ అంటారు!" అన్నది.

"మనం చనిపోయి దయ్యాలయ్యాక...అలాంటి ఆత్మతో ఆత్మ స్నేహం చేసుకోవచ్చు కదా ఆంటీ! బ్రతికున్నాం కాబట్టి ప్రస్తుతం అంగ అంగ అనంగస్నేహం చేయటమే మంచిదని నా ఉద్దేశం... అదే అలౌకికమైన ఆనందం. అంతరంగ సంతోషం."

"నిజంగా బావుంటుందా ఆనందరావ్?"

"అనుభవిస్తే గానీ అది తెలీదు ఆంటీ... ఆత్మస్నేహాలు చేసే మీలాంటి వారికి అది అస్సలు అర్థం కాదు."

ఇద్దరి మధ్యా ఇలాంటి అమలిన అలౌకిక ఆత్మాత్మ వేదాంతేతర శబ్ద ఇష్ట భూయిష్ట చర్చలు కొన్నాళ్ళు జరిగాక ఆమె సహజంగానే దగ్గరయింది.

మంచం మీద వెల్లకిలా పడుకొని చేతులు తల క్రింద పెట్టుకుని పై కప్పు కేసి చూస్తూ...

"మీరు పుణ్యక్షేత్రాలు దర్శించేది అలౌకిక సంతోషం కోసం... నేను బహువిధ క్షేత్రాలు దర్శించేది లౌకిక ఆనందం కోసం!" అంటూ తన ఫిలాసఫీ చెప్పాడు.

ఇలా ఎప్పటికయ్యేది ప్రస్తుత మప్పటికా పనులు చేసి... పేరుకు తగినట్టు అతడు నిరంతరం ఆనందంగా ఉంటాడు. అయితే ఒక్కోసారి కొన్ని రివర్స్ దెబ్బలు కూడా తగులుతూ ఉంటాయి.


ఇరవై ఏళ్ల అమ్మాయి కవిత ఒకటి పత్రికలో పడింది. దాంతోపాటు ప్రచురితమైన ఆమె ఫోటో చాలా అందంగా, అద్భుతంగా ఉంది. కష్టపడి అడ్రస్ సంపాదించి ఆ కవితను

పొగుడుతూ రెండు పేజీల ఉత్తరం వ్రాశాడు.

రెండురోజుల తర్వాత తిరుగు టపాలో దానికి సమాధానం వచ్చింది.

"కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు. కానీ మంచి రచయిత అన్నవాడు తను రాసింది మళ్లీ చాలా డిటాచ్మెంట్‌తో నిర్దాక్షిణ్యంగా చదువుకోవాలి. ఆ విధంగా చూస్తే నాది అంత గొప్ప కవిత కాదు.నేను ఇంకా చాలా ఎదగాలి. అది కూడా మీకు నచ్చింది అంటే మీ టేస్ట్ ఎంత సాధారణమైనదో అర్థమైంది. నమస్తే." అని. (మంచి ఆరోగ్యం కోసం రోగులు తినే) చేదు మల్టీ-గ్రెయిన్ బిస్కట్ విసిరింది.

అయితే దానికి అతడు పెద్దగా బాధపడలేదు. మచ్చల లేడి దొరక్కపోతే



మరొక తెల్ల కుందేలు దొరుకుతుందనేది అతడి ఫిలాసఫీ.

జ్ఞానుల్నీ, హేతువాదుల్నీ బాబాలు పట్టించుకోరు. తాము చెప్పేది వినేవారినీ, తీరని కోరికలున్న వారినీ మాత్రమే శిష్యుల్ని చేసుకుంటారు.

ఆనందరావు అదే నమ్ముతాడు.

అప్పుడప్పుడు ఊహించని ప్రమాదాలు వస్తూ ఉంటాయి. గుళ్ళో మూలవిరాట్ దర్శనంలో ఉండగా, బయట నుంచి మరో భక్తురాలి ధ్వజస్థంభ గంట విన్పించి కొన్నిసార్లు ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

(చదువరీ! తమ కోలనీలోనే అతడికి ఎందరో స్త్రీలతో పరిచయం ఉన్నదని తెలిసీ, అదే వీధిలోని మరొక మగువ అతడికి ఎలా దగ్గర అవుతుందని అనుమానం వలదు... అప్పట్లో రాజేష్‌ఖన్నా గురించీ, ఇప్పట్లో సల్మాన్‌ఖాన్ గురించి తెలిసీ అతడి కండలకీ, మంచి(!) తనానికీ ఎందరెందరో ఎలా వెంటపడతారో విదితమే కదా. నవనవలాడే కూరగాయల షాపుకే రష్ ఎక్కువ ఉంటుంది).

అయితే సరస్వతీ పుత్రుడు ఆనందరావు స్వతహాగా మంచివాడు. అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం ఒక్కటే అతడి ఒక ధీర(చెడు)గుణం.

అతడి వెనుక చిన్న సైజు స్టూడెంటు ఫోర్సు ఉన్నది కాబట్టి వీధి జనం అతడిని కొట్టకుండా, వీధి ఖాళీ చేయమని దీనంగా ప్రార్థించారు.

అదీగాక అతడికి కూడా ఆ లోకాలిటీ మోహం మొత్తింది.


అందుకే వీధి మార్చేసే విషయం గురించి సానుభూతితో, సామాజిక బాధ్యతతో పరిశీలించాడు.

కస్తూరిబా కాలేజ్ ప్రాంతాల్లో రూము దొరికే అవకాశం ఉంది. పక్కన అమ్మాయిల కాలేజ్ ఉంది కాబట్టి ఇంటి యజమాని అయిదొందలు ఎక్కువ అడ్వాన్స్ అడుగుతున్నాడు...

అదీ అతడి ప్రస్తుత సమస్య...!

✦✦✦






సరస్వతి దిగులుగా ఉండటం చూసి బ్రహ్మ "ఏమైంది సరస్వతీ?" అని అడిగాడు.

"ముగ్గుర్ని సృష్టించాను కదండి... అందులో ఆ ఇంద్రసతి ఆడిన క్షుద్ర నాటకం వల్ల ప్రొఫెసరు భార్య లలిత పరమ గయ్యాళిగా తయారైంది."

"అయితేనేం?... ఇంకా ఇద్దరు కుర్రాళ్ళూ, లలిత పోలికలున్న మరో అమ్మాయీ ఉందిగా?" అన్నాడు బ్రహ్మ.

"ఆ ఇద్దరిలో ఒకడేమో వీధిలో కనబడిన ఆడదాన్నల్లా..." చెప్పలేక ఆగిపోయింది.

"మరి మూడోవాడు?"

"పేరు సాత్వికరావు. పరమ సాత్వికుడు! అతడి మీదే నా ఆశంతా!"

"ఆ సాత్వికరావు ఏం చేస్తూ ఉంటాడు?"

"బ్యాంకులో పని చేస్తూ ఉంటాడు."

"రెండో అమ్మాయి ఏం చేస్తోంది?"

"ఎవరు? లలిత పోలికలున్న అమ్మాయేనా? ఆ అమ్మాయి పేరు రాధ... కస్తూరిబా గర్ల్స్ కాలేజీ పక్కన కృష్ణావిలాస్ హోటల్ నడుపుతోంది."

"మరింకేం!... ఆ అమ్మాయి రాధనీ, సాత్వికుడినీ కలుపు!"

"అదంత సులభం కాదేమోనండీ!" అంది సరస్వతి ఆందోళనగా...

"...ఆ అభినవ కాసనోవా ఆనందరావు ఈ రోజే కస్తూరిబా కాలేజీ వీధిలో కృష్ణావిలాస్ హోటల్ పక్కనే రూము తీసుకుంటున్నాడు".


"అంటే రాధ జీవితం...కుక్కలు చింపిన విస్తరి కాబోతోందా?"

"రాధది అరిటాకు విస్తరి కాదండి... ఆ అమ్మాయి కంచు గుండెల్ది. నా దిగులల్లా సాత్వికరావు గురించి!"

✦✦✦

గుండుబోయిన సాత్వికరావు బ్యాంక్‌లోకి రావటం గమనించగానే లేడీ క్లర్కులు అందరూ ఒకరి ముఖాలొకరు చూసుకుని ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"ఈ మహానుభావుడిని ఎవత్తె చేసుకుంటుందో గానీ... మహా సుఖపడి పోతుంది!" అన్నది మంజులత.







“ఎందుకనో?...” చిలిపిగా అడిగింది సుధీర.

“ఎందుకేముంది?.. అన్నీ రివర్సే గదా!”

లీలగా ఆ మాటలు వినపడి... సాత్వికరావు ముఖం ఎర్రబడింది.

వాళ్ళు తనని చూసే నవ్వుకుంటున్నారని అతనికి తెలుసు. అయినా తను చేయగలిగిందేమీ లేదు. అలవాటు ప్రకారం తన మీద తనకే కోపం వచ్చింది. ఈడు వచ్చిన ఆడపిల్లలతో మాట్లాడటానికి పోడు భూమిని దున్నేవాడిలా తను ఎందుకంత భయపడుతున్నాడో తెలియటం లేదు. చిన్నప్పుడు నిక్కర్లు వేసుకునే రోజుల్లో ‘పక్కింట్లో పరికిణీ పండగ రోజు ఎదురింటి రమణి చేసిన చిలిపి పని వల్ల తనకీ మనోవైకల్యం ఏర్పడిందా?’ అన్నదొక అనుమానం.




నెమ్మదిగా వచ్చి కౌంటర్‌లో కూర్చున్నాడు.

ఇంకా కస్టమర్స్ ఎవరూ రాలేదు. అదే బ్యాంకులో డిపాజిట్లు చూసే హరిత వచ్చి పక్క సీట్లో చేరే సరికి పై ప్రాణాలు పైనే పోయాయి.

బ్యాంక్‌లో తనను మరీ ఆటలు పట్టించే వాళ్ళలో ఆమె ఒక్కర్తె.

అయితే ఈరోజు ఆమెలో ఏదో తేడా కనపడింది. అలా తేడాగా కనపడటానికి కారణం ఆమె తరువాతి సంభాషణలో తేలింది.

“గుడ్ మార్నింగ్!” అంది గుసగుసలాడుతున్నట్టు.

“గ్గు... గ్గు... గుడ్ మార్నింగ్!... గుడ్ మార్నింగ్!!” గాభరాగా అన్నాడు.

“ఈవేళ మీరు చాలా స్మార్ట్‌గా ఉన్నారు.” నవ్వింది.

నిజంగానే అందగాడు.

“అలాగా! థ్యాంక్యూ.” అంటూ మరింత అందంగా సిగ్గు పడ్డాడు.


“మీరు చాలా మంచివారనీ, ఆడపిల్లల జోలికి రారనీ, వాళ్ళే ఒకవేళ వచ్చినా పారిపోతారనీ ఇన్నిరోజులూ మీ గురించి చాలా చెడుగా ఊహించుకున్నాను.”.


మంచివాడి గురించి చెడుగా ఊహించుకోవటం ఏమిటో! ఆడపిల్ల ప్రపోజ్ చేస్తే పారిపోవటం ‘చెడు’ ఎలా అవుతుందో... అతడికి అర్థం కాలేదు. కాంట్రవర్సీ ఎందుకని...

“ఆహా! అలాగా?” అన్నాడు.

“గుర్రపు స్వారీ ఎక్కడ నేర్చుకున్నారు? ఊటీ కొండల మీదా?... లేక డెహ్రాడూనా?” అని అడిగింది.

ఈ ప్రశ్నకి అతడు బిత్తర పోయాడు సాత్వికరావు. **(సశేషం)**





# టపాసుల టపటప!... పటాసుల పటపట!

కండ్లకుంట శరత్‌చంద్ర
+1(236)516-1212

**ఓ హాస్యానందం పాఠకుడు, సంచి నిండా టపాకాయలు కొనుక్కొచ్చాడు.**


**సెప్టెంబర్ వరదల్లో అవి బాగా నాని ఉండడంతో, మేడ మీద ఎండలో ఎండబెట్టాడు!**

**ఆ తర్వాత ఇంటిల్లిపాది కలిసి, ఇంట్లో లక్ష్మీ పూజ చేస్తున్న సమయంలో...**

**టపాకాయలు వాటి భాషలో మాట్లాడుకోవడం... కాదు... కాదు పోట్లాడు కోవడం మొదలెట్టాయి.**

"ఏమే చిచ్చు బుడ్డి! అందరి మధ్యా చిచ్చుపెట్టడమేగా నీ పని?... ఎట్టా ఉందే వొళ్ళు? నా మీద ఎండ పడకుండా, అడ్డుగా ఉన్నావేంటి? అసలే సెప్టెంబర్ నెల వర్షాలతో తడిసి తడిసి ముద్దయ్యి ఉన్నాను. పక్కకు జరుగు... లేదంటే, పేల్చిపారేస్తా!" గయ్యిమంది ఎండకు మొహం వాచిపోయి ఉన్న ఔటు.

దానికి చిచు బుడ్డి, ముక్కు చీదుకుంటూ– "ఏమాటకామాటే చెప్పుకోవాలి ఔటు అత్తమ్మా! నన్ను చిచ్చుబుడ్డి అంటారు కానీ, చాలా మంది జనాలు పెట్టే చిచ్చుతో పోలిస్తే, నా చిచ్చు ఎంత? సముద్రంలో కాకి ఉమ్మంత! వాళ్ళ పని వాళ్ళు చూస్కోకుండా, తిని తొంగోక, వేరే వాళ్ళ మధ్య చిచ్చులు పెడతారు అత్తమ్మా జనం!... అసలు, రామాయణంలో మంథర పాత్రను చూసి బుద్ధి తెచ్చుకోవచ్చుగా! తెచ్చుకోరు. పైగా నన్ను చిచ్చుబుడ్డి అంటారు! జనానికైతే తెలీక అన్నారనుకోవచ్చు. నువ్వు కూడా అలా అంటే ఎలా అత్తమ్మా?... అయినా, నన్ను ఎన్ని మాటలన్నా సరే, హాస్యానందం పత్రికలో కథలూ, కార్టూన్లు చూసినంత సంబరంగా నా దగ్గరే నిలబడి... నన్ను చూస్తూ కాలుస్తారు... మరి నిన్నో!? వెలిగించి పారిపోతారు.... నీ పేలుళ్ళు నా దగ్గర పేలకు అత్తమ్మా!" అని...



చిర్రుబుర్రులాడుతూ నిజాలు బయటపెట్టింది.

ఔటు ఏదో అనేలోపు, కాకరపువ్వొత్తి– "నేనర్రా కాకరపువ్వొత్తు బామ్మ గారిని! మీలో మీరే తన్నుకు చావండి! ఎండ అందరికీ అవసరమే! సీట్లు లేక 'కుంజరయూథంబు దోమ కుత్తుకజొచ్చెన్' అన్నట్టు ఇరుక్కుని కూర్చోవడానికి... ఇదేమైనా బస్సా, రైలా?... కావాల్సినంత చోటు ఉంది కదా? కాస్త అటూ ఇటూ జరిగి సర్దుకోండి!" అంది.

"నోరు ముయ్యవే పనికిమాలిన కాకరపువ్వొత్తి!" అంది ఔటు.

వెంటనే కాకరపువ్వొత్తి– "నేను చిటపట అంటానని కదూ మీ వెధవ అభిప్రాయం. మీరు ఏ పటాస్ కాల్చాలన్నా... నేను కావాలి! ఆ మాత్రం తెలీదుట్రా పింజగుంజారి సన్నాసుల్లారా! వృద్ధురాలినని నన్ను చిన్న చూపు చూసారో, నేనిక మాట్లాడను. నేను లేకుండా మీ పటాసులు ఉడకవ్రోయ్... అదే పేలవురోయ్! ఎక్కువగా మాట్లాడితే... దగ్గరకొచ్చి, రెండు తగిలిస్తాను ఏమను కున్నావో...ఆఁ!" అంది.



వెంటనే ఔటు– "నేను పేలితే, అంతా హడల్! నా దగ్గరికొచ్చావో ఒళ్ళు హూనం చేస్తా! నా ప్రతాపం అంతా ఇంతా కాదు... బస్తీమే సవాల్! నాకు నీతులు చెప్పొద్దు!" అంది.

"నీ తలకాయ్! అసలు నన్ను వెలిగించకుండా నిన్నెలా వెలిగిస్తారు? ఇలా బీరాలు పలుకుతూ పేలి అందరికీ కంపరం ఎత్తిస్తావ్. గుండె జబ్బులు ఉన్న వాళ్లకు, చిన్నపిల్లలకు నువ్వంటే పరమ రోత! నీకు దమ్ముంటే, రోజూ నాలుగు దినపత్రికలు చదువు, 10 తెలుగు టివి వార్తా ఛానెళ్ళు చూడు. ప్రతి చిన్న వార్తకూ వాళ్లు పెట్టే నేపథ్య సంగీతపు హోరులో, జనాల గుండెల్లో వాళ్ళు పేల్చే సంచలన వార్తల బాంబులతో పోల్చితే నీ ప్రతాపం ఎంతే? నోరు ముయ్యి!" అంది కాకరపువ్వొత్తు.

దెబ్బకు ఔటు నోరు మూసుకుంది.

"ఆఁ...అద్గదీ అలా ఉండు! ఈ పేలే టపాసుగాళ్ళకు అహంకారం ఎక్కువ!" అంది కారపువ్వొత్తి బామ్మ.


అది విన్న సీమటపాకాయ– "అయిబాబోయ్! ఒకప్పుడు మా పవర్ శానా ఉండేదండీ! ఇప్పుడు బొత్తిగా పడిపోనాది, బామ్మగోరూ! రోజు ఉదయం టీవీలలో చిన్నసైజు రాజకీయ నాయకులు తిట్టుకుంటుంటే చూడండి. ఒకడు మాట్లాడేది ఒకడు వినడు. ఓ కొట్టేసుకుంటూ ఉంటారు... ఓ అరగంట కార్యక్రమం వింటే, లక్ష సీమటపాసుల శబ్దం రాదంటారా?!... అసలు మేము వాళ్ళ ముందు పనికొత్తామా సెప్పండి?!" అంది.

నువ్వైనా నాలానే పైకి ఎగురుతావ్... అయినా ఏం ఎగరడంలే! గత నలభై ఏళ్లుగా ప్రయత్నిస్తున్నానురా, దేశంలో పెరిగే ధరల కన్నా ఎక్కువగా ఎగురుదామని... ఎగరలేక భుజాలు, నడుము పడిపోతోంది కానీ, ధరలను మాత్రం దాటి ఎగరలేక పోతున్నా. ధరలను దాటి, ఒక్కసారైనా గెలవాలని ఉందిరా! అన్నట్టు, నేను పైకి ఎగిరేదే మీరు చూస్తున్నారు... అంత ఎత్తు నుండి, కింద పడేటప్పుడు ఉంటుంది అసలు బాధ!" అంది.

కాకరపువ్వొత్తి బామ్మగారు..."నేను కాపడం పెడతాలే నాయనా, బాధ పడకు!" అంది.

"అయ్యయ్యో బామ్మగారు!... మీరు సర్దుకొని కూర్చోమన్నారు అని...ఈ వంకాయ ఔటుగాడు నా కాలు తొక్కుతూ, నన్ను ఆను కొని కూర్చుంటున్నాడు, కాస్త ఇటు చూడండి!" అంది వెన్నెల తీగ.

కాకరపువ్వొత్తి బామ్మ– "రేయ్! వంకాయ! ఔటున్నర ఔటుగా!... నువ్వేమో గట్టి గట్టి సుతిలీ తాడుతో, గట్టి మందుగుండు నింపుకొని... దుక్కలా ఉన్నావు. పాపం! ఆ వెన్నెల తీగ సన్నగా, నాజూగ్గా ఉంది. దాని కాలు తొక్కడం ఏంటి? కాస్త పక్కకు జరిగి చావు! వంకాయ పెంకుగా!" అంది.



వెంటనే భూచక్రం, జలుబు తుమ్ములు రెండు తుమ్మి– "అయ్యయ్యో బామ్మగారూ! నా మీదా కాస్త జాలిపడండి! అబ్బబ్బ జనం నన్ను తిప్పే తిప్పుడుకు నా కళ్ళు గిరగిరా తిరుగుతాయి!" అంది.

దానికి కాకరపువ్వొత్తి బామ్మగారు– "అవును నాయనా! నీ సంగతే మర్చిపోయాను...అసలు జనం నిన్ను చూసి నేర్చుకుంటే బాగుంటుంది. అడ్డమైన తిరుగుళ్లు తిరక్కండి... మీ తిరుగుడుకు ఓ మంచి లక్ష్యం ఉండి ఏడిస్తే బావుంటుంది...ఇదీ నువ్వు ఇచ్చే సందేశం. నిన్ను కాల్చేప్పుడు, జనం అది కాస్త ఆలోచిస్తే మంచిది!" అంది.

"సరే బామ్మగారు! అసలు బతికితే తారాజువ్వలా బతకాలి... పక్షిలాగా, ఆకాశంలోకి దూసుకుపోతుంది! మేమూ ఉన్నాం, ఎందుకూ? నేల మీదే తిరగాలి!" అంది భూచక్రం.

తారాజువ్వ తలబాదుకుంటూ– "రేయ్ పిల్లకుంక! నీకేం తెలుసురా నా కష్టాలు! కింద మంటపెడితే,



“నీకు తెలుసు కదా బామ్మ నేను ఈ వెన్నెల తీగను ప్రేమిస్తున్నాను అని! ఏదో రకంగా ప్రేమలో పడేయ్యాలని నానా తంటాలు పడు తుంటే, నన్ను పక్కకు జరగమంటావేంటి?” అన్నాడు వంకాయ ఔటు.

“ఓరి నీ దుంపతెగ! ప్రేమిస్తే, అలా కాలు తొక్కేయడమేనా? అసలే అది మల్లెపువ్వంత బరువున్న అమ్మాయి. నువ్వెళ్ళి దాన్ని పెళ్ళి చేసుకొని వెలగబెట్టేదేంట్రా? బెదిరించడానికి తప్ప! కాపురం చెయ్యడానికి నువ్వు ఆ వెన్నెల తీగకు సరిపోవు...పో! పోయి ఏ ఔటునో వెతుక్కో.. పో!” కసిరింది కాకరపువ్వొత్తి.


“అబ్బా! మనుషుల్లో లాగా ఇక్కడ కూడా కులం పట్టింపులా బామ్మా?...ఇలా అయితే నాలాంటి ప్రేమికులు ఏమైపోవాలి?” అంది.

“నీ తలకాయ్!... కులం సంగతి కాదురా వెర్రివాడా! అయినా మనది ఒకే కులం! టపా కాయల కులం! పెళ్ళంటే... ఈడూ జోడూ చూసుకోవాలి కదా!?” అంది కాకర పువ్వొత్తి బామ్మ!

ఈలోపు, సాయంత్రం అయ్యింది. దీపాలు వెలుగుతున్నాయి. టపాకాయలు, మేడ మీది నుండి కిందికి తెచ్చారు.

ఓ మట్టి ప్రమిదలో వెలుగుతున్న దీపం... తన పక్కనే నిలబడినకుర్రాడితో అంది...

“చూడు తమ్ముడు! దారి చూపడం నా పని, లక్ష్యం దాకా తీసుకుపోవడం కాదు! మరో మాట, కుదిరితే... నలు గురికీ నాలా దారి చూపించు. ఇంకో మాట, అగ్గి వెళ్లి పెట్రోల్ మీద పడినా, పెట్రోల్ వచ్చి అగ్గి మీద పడ్డా... మండేది పెట్రోలే, మిగిలేది బూడిదే.




అంచేత, నన్ను జాగ్రత్తగా వాడు తమ్ముడూ! చివరిగా ఓ మాట, నేను పంచభూతాల్లో ఒకదాన్ని, గౌరవం ఇచ్చుకో. తేరగా దొరికాను కదా అని నాతో వెధవ్వేషాలెయ్యకు.”

అన్ని టపాసులు కలిసి–“చూడండి! తెలుగు ప్రజలు, మాకు చక్కటి తెలుగు పేర్లు ఉన్నాయి. వాటితో పిలవండి. అంతే కానీ, చిచ్చుబుడ్డిని ఫ్లవర్ పాట్ అని, భూచక్రాన్ని ఎర్త్ వీల్ అనీ, తారాజువ్వను రాకెట్ అని, ఔటును బాంబ్ అని, కాకరపువ్వొత్తిని స్పార్కుల్ అని పిలవక్క ర్లేదు. ఆలోచించుకోండి... దీపావళి శుభా కాంక్షలు. హాస్యానందం పాఠకులకు మరీ మరీ ప్రత్యేక శుభాకాంక్షలు!” అంటుండగా...


ఒక్కొక్క టపాకాయ కాలుస్తూ ఆ ఇల్లు సంతోషంలో మునిగి తేలుతోంది.

మరి, మనమూ తేలదామా?...

ఇంకెందుకు ఆలస్యం...

పదండి దీపాలు వెలిగిద్దాం!










# నొక్కావలసింది... నీ దగ్గర ఉంది!

నాగమంజరి గుమ్మా,
9985667500

**"మండూ..." పిలిచాడు మండూకరావు పల్లీల పొట్లం విప్పుతూ.**

**"చెప్పు మండూ!..." అంది మండోదరి.**

**"నా చెప్పులు నీకెందుకు మండూ?... భరతుడిలా నెత్తిన పెట్టుకుంటావా? కుర్చీపై పెట్టి పూజిస్తావా?" అడిగాడు మండూకరావు.**

**"ఇదిగో... నీలాంటోడితో పెట్టుకున్నాను చూడూ అందుకు నన్ను నేననుకోవాలి. అసలే నీకు పరిజ్ఞానం తక్కువ!... పరధ్యానం ఎక్కువ!!" తలకొట్టుకుంది మండోదరి.**

"తల కొట్టుకోకు మండూ! తలనొప్పి వస్తుంది. మండూ!... మండూ..." ఏదో చెప్పబోతూ ఆగాడు మండూకరావు.

"మనం ఇలా బీచ్‌లో ప్రేమించుకోవడం బావుంది కదా మండూ!" అడిగింది మండోదరి.

"అవును! కానీ... నేనొకటి చెప్పాలనుకున్నాను" చెప్పాడు మండూకరావు.

చెప్పు మండూ! అనబోయి, మళ్ళీ చెప్పులు, రామాయణం అంటాడని నోటిలో మాట బయటకు రాకుండా అరచేతిని అడ్డంగా నోట్లో కుక్కుకుంది మండోదరి.

"మండూ! నేను నిన్ను ఒకటి అడగాలనుకుంటున్నాను, కాదనవుగా?" అడిగాడు మండూకరావు.

"ఏమిటది మండూ!" అంది మండోదరి, గట్టిగా కొరుక్కున్నందున గాట్లు పడిన తన అరచేతిని చూసుకుంటూ...

"మరే... మరే... నువ్వు తిట్టకూడదు. నువ్విస్తే నేను తీసుకుంటా అది." అన్నాడు మండూకరావు.


అదేమిటా అని ఆలోచించి... ఆ అడిగిన విధానికి ఏదో మధుర భావన తోచి పరవశంగా కనులు మూసుకొని... "అడుగు మండూ! తప్పకుండా ఇస్తాను." అంది మండోదరి.

"రేపు కలిసినప్పుడు నాకోసం మరమరాల ఉండలు తెస్తావా! నాకు అవంటే ఎంతిష్టమో! మా చిన్నప్పుడు సంతలో అమ్మితే కొనుక్కుని తినేవాణ్ణి. గత రెండు రోజులుగా కలలోకి వస్తున్నాయవి." పెదవుల చివర్ల ద్రవం చేరుతూ ఉండగా తన్మయంగా చెప్పాడు మండూకరావు.

చివ్వున లేచింది మండోదరి.

"నీకు బుర్ర ఏమైనా ఉందా మండూ! ఏకాంతంలో అడగాల్సింది ఇదా?! ఇద్దరి పేర్లు కలిసాయి కదా అని నీతో ప్రేమలో పడ్డాను. ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో! నీకిచ్చేదే లేదు. ఇకపై నీతో కలిసేదీ లేదు! పో!!" అంటూ విసవిసా వెళ్ళిపోయింది మండోదరి.

తాను అడిగిన మరమరాల ఉండలకు ఎక్కువ ఖర్చు అవదు కదా! అయినా మండోదరికి అంత కోపం ఎందుకు వచ్చిందో తెలీక తెల్లమొహం వేసుకుని చూస్తూ ఉండిపోయాడు మండూకరావు.






మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక! 10

# శేఖర్

పుట్టింది మచిలీపట్నంలో అయినా పెరిగింది, చదివిందీ కార్టూన్లకు శ్రీకారం చుట్టిందీ అంతా విజయవాడలోనే. నాకు కార్టూన్లంటే 'ఇష్టం' అనే కంటే....'వ్యసనం' అనే పదం కరెక్టుగా సూటవుతుందేమో!

8వ తరగతి నుండే లైబ్రరీకెళ్లి తనివితీరా...అదే మెదడు తీరా పుస్తకాలు చదవడం హాబీ. అలా 10వ తరగతి కొచ్చేసరికి జోకులు రాయడం అవి ఆంధ్రజ్యోతి, ప్రగతి, అనామిక పత్రికల్లో అచ్చు కావడంతో బొమ్మలు ప్రాక్టీస్ చేసి కార్టూనిస్ట్ అవ్వాలనే కోరిక కలిగింది. వచ్చీరాని బొమ్మలతో రూళ్ళ పేపర్ మీద బ్లాకలర్ పెన్‌తో కార్టూన్‌లు వేసి పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారి దగ్గరికి తీసుకెళ్తే...కార్టూన్‌లో ప్రాథమిక సూత్రాలు, గురువుని ఎంచుకుని బొమ్మలు గీసే విధానం గురించి చెప్పిన తీరు... పితృ వాత్సల్యంగా అనిపించాయి. సంవత్సరంపాటు ప్రాక్టీస్ చేసాక శ్రీ శర్మగారే నన్ను ప్రోత్సహిస్తూ ప్రచురించిన తొలి కార్టూన్ ఆంధ్రజ్యోతి 15.2.1976 సంచికలో వచ్చింది. దాంతో పట్టలేని ఆనందం... కార్టూన్ అంటే ఒక ఎడిక్షన్‌గా మారింది.


ఆ ఊపుతో నేటివరకూ దాదాపు 224 పత్రికల్లో అందులో 218 తెలుగు పత్రికలంటే ఎవ్వరూ నమ్మరేమో!(ఆ లిస్ట్ ఇక్కడ స్థలాభావంతో ఇవ్వడం లేదు.)


సంఖ్యాపరంగా ఎన్ని వేసాను అనే కంటే 'లక్ష'ణమైన కార్టూన్లనే వేసాననే తృప్తి వుంది.


ఈ సందర్భంగా ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు...(నన్ను ప్రోత్సహించిన పత్రికాధిపతులకు, కార్టూనిస్ట్ మిత్రులకు)

మూడు దశాబ్దాలకు పైగా రాజమండ్రి లోకల్ ఛానల్‌లో కార్టూనిస్ట్‌గా, రెండు దశాబ్దాలకు పైగా ప్రజాశక్తి కార్టూనిస్ట్‌గా (ఉభయ గోదావరి జిల్లాల టేబ్లాయిడ్‌లో) కొనసాగుతూ... ఏకవ్యక్తి కార్టూన్ల ప్రదర్శనలు, కార్టూన్ సంకలనాలు, సన్మానాలూ... సత్కారాలూ, బహుమతులు, ప్రముఖులతో పరిచయాలూ...ఇవన్నీ నేను చదివిన డిగ్రీలు, చేసిన ఉద్యోగం కంటే కార్టూన్ల ద్వారానే గౌరవం దక్కిందనేది నిజం.


ఎప్పటికీ...కార్టూన్లనే ఆరాధిస్తాను... ఆస్వాదిస్తాను...కొత్తదనం వుందంటే ఆచరిస్తాను.


















ఈ రోజు ఇంట్లో పని 5 నిముషాలెక్కువ చేయించుకున్నారు... రూ.250/- ఫోన్‌పే చేయండి అమ్మగారు...!



ఆస్తులు పంచేస్తాం గానీ.... మమ్మల్ని పంచుకోకండ్రా బాబు మీకు పుణ్యముంటుంది....!



బట్టకి అంటిన మైలైతే పోగొట్టొచ్చు కానీ... ఒంటికి పట్టిన అవినీతి మరకల్ని మాత్రం ఏంచేసినా వదిలించలేం సార్....!!!



మహిళలపై మానభంగాలు, మర్డర్లు, యాసిడ్ దాడులు... లైంగిక వేధింపులు అరికట్టకపోతే... స్త్రీజాతికి మనుగడే... లేదు...!
మహిళా సాధికారత ప్రసంగం
అందులో మనం చేసినవే... ఎక్కువున్నాయ్... సార్...!


మన ముఖాల మీద తుంపర్లు పడేలా మాట్లాడుతున్నాడు... దేనిమీద...?
తుంపర సాగు మీద!


జాగ్రత్తగా చూసి నడువ్... అసలే మా ఊళ్ళో గోతులెక్కువ....


సార్‌కెప్పుడూ అలాంటి వాటితో ఓట్లు అడుక్కునే అవసరం లేదయ్యా!
కులం, మతం, భాష పేరుతో ఓట్లడగొద్దు
ఎన్నికల కమీషన్


అన్నం వద్దు తల్లీ... షుగరొచ్చింది అరికలు, సాములు, కొర్రలు, సజ్జలతో... వండినవుంటే... వేయండి!


ఈ యాభై వుంచు! ఇవి నేనింట్లో చేసిన దోసెలంటే... వంకలుపెట్టి విసిరేస్తుంది నువ్విచ్చావంటే లొట్టలేస్తూ తినేస్తుంది!
swiddy



# ఫిట్టింగ్ పంకజం

పేట యుగంధర్
9492571731

**"ఏమండీ!... సాయంత్రం ఆఫీస్ నుండి తొందరగా వచ్చేయండి." కళ్లతోనే హొయలు చల్లుతూ చెప్పింది మంజుల.**

**"ఛీ! పాడు!! ఏంటా చిలిపి కోరికలు?" సిగ్గుతో వంకర్లు తిరుగుతూ అన్నాడు ఘటికాచలం.**

**"అబ్బా! మిమ్మల్ని తొందరగా రమ్మన్నది అందుకు కాదు!" అంటూ విల్లు పట్టుకున్న సత్యభామలా విరుచుకు పడింది మంజుల.**

"మరి ఇంకెందుకు?" నల్లగా ముఖం పెట్టి, మెల్లగా అడిగాడతను.

"దీపావళి రోజున కట్టుకోవడానికి మన పక్కింటి పద్మావతి పదివేలు పెట్టి కొత్త కంచిపట్టు చీర కొన్నదట. ఆ చీరను కాలనీ వాళ్ళందరికీ చూపిస్తూ బడాయి పోతుంది... మనం అంతకన్నా ఎక్కువ ఖర్చు పెట్టి ఆవిడ పట్టుచీరకు అమ్మమ్మ లాంటి చీర కొందాం... ఆవిడగారి అహంకారాన్ని అణచివేద్దాం." ఆవేశంగా అంది మంజుల.

ఆ మాట వినగానే ఘటికాచలంకంగారుగా– "అమ్మమ్మ చీరకు వేలకు వేలు తగలెయ్యడం ఎందుకు దండగ! పాత చెక్క పెట్టెలో మా అమ్మ కట్టుకున్న... జరీచీరలు మూడేళ్ళుగా మగ్గిపోతున్నాయి... వాటిని ఇస్త్రీ చేసి కట్టుకో!" ఉచిత సలహాను రుచిగా చెప్పే ప్రయత్నం చేశాడు ఘటికాచలం.

ఆ మాట వినగానే మంజులకు ఒంటి మీద తేళ్ళూ, జర్రెలు జరజరా పారాడుతున్నట్టు అనిపించింది.

"ఛీ! శుభ్రత తెలియని మీ అమ్మగారి చీరలు కట్టుకునే ఖర్మ నాకేంటి? నాకు కొత్త పట్టుచీర కావాల్సిందే!" మంకు పట్టు పట్టింది మంజుల.

తన తల్లిని తేలికగా మాట్లాడినందుకు పటాసులా పేలాలనుకున్నాడు ఘటికాచలం. కానీ తన టంగు కన్నా...తన పెళ్ళాం టంగు ఖంగున మోగుతుందని, ఆమె చెంగు పట్టుకున్న నాడే అతనికి అర్థమయ్యింది. ఆవిడ నోటి ముందు అవగింజలా మాడిపోతాడని... దూదిపింజలా ఎగిరి పోతాడని తెలుసు గనుక చీకిపోయిన చిచ్చుబుడ్డిలా ఆవేశాన్ని తనలోనే అణుచుకున్నాడు.

"దీపావళి రోజున నూలు బట్టలు కట్టుకోవాలని శాస్త్రం చెబుతోంది. నువ్విలా కంచిపట్టు పేరు చెప్పి నా కొంప ముంచకు." అంటూ పంచ కట్టును గట్టిగా బిగించే ప్రయత్నం చేశాడు ఘటికాచలం.

"అదంతా నాకు తెలియదు. నాకు కంచిపట్టు కావాల్సిందే. ఆ పద్మావతి పొగరు అణచాల్సిందే!"

"ఇంతకీ ఆ పద్మావతి బడాయి పోతున్నట్టు నీకు చెప్పిందెవరు?" సాలోచనగా అడిగాడు ఘటికాచలం.


"మన ఎదురింటి పంకజం పిన్ని చెప్పింది." కళ్ళను కుంకుడు కాయల్లా తిప్పుతూ చెప్పింది మంజుల.

"ఇంతకీ మీరు నాకు చీర కొనిపెడతారా? లేదా?... ముందుగా ఆ సంగతి తేల్చండి!" సంభాషణను మెయిన్ ట్రాక్ ఎక్కించింది మంజుల.

"నీ నోటి ముందు నిండా మునిగాక, తేల్చే తెగువ నాకెక్కడిది? సాయంత్రం తొందరగా వస్తాను. అలాగే తగలడు." అంటూ ఆఫీసుకు బయలుదేరాడు ఘటికాచలం.

✦✦✦

పెళ్ళాం కోరినట్టే ఆ సాయంత్రం పదిహేను వేలు పోసి పెళ్ళంకు






కంచిపట్టు చీర కొనిచ్చాడు ఘటికాచలం. స్టార్ హోటల్ భోజనంతో సహా, సెకండ్ షో సినిమాకు సైతం ఖర్చు పెట్టక తప్పలేదు.

✦✦✦

ఉదయం ఐదింటికే నిద్రలేచి తను కొన్న చీరను ఇరుగు పొరుగుకు చూపిస్తూ డప్పుకొట్టి మరీ చెప్పుకుని మురిసి పోయింది మంజుల.

అందరి పొగడ్తలు విని ఉబ్బితబ్బిబ్బయిపోయింది. ఆ సంతోషంతో భర్తకు ఇష్టమైన టిఫిన్లు వండి, వడ్డించింది.

"అమ్మా! మంజులా!!" కమ్మగా పిలుస్తూ వచ్చింది పంకంజం.

"పిన్ని గారూ!... రండి రండి!!"

"ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఓ రెండు కప్పుల బియ్యం అప్పుగా ఇవ్వమ్మా!"

"నువ్వు అడిగితే కాదంటానా పిన్ని! ఇంతకీ నేను కొన్న పట్టుచీర గురించి మన కాలనీ వాళ్లు ఏమనుకుంటున్నారేమిటి?" అంటూ ఆరా తీసింది.

"మన కాలనీలో ఏదైనా నువ్వు చేసినంత గొప్పగా మరెవరు చేస్తారు చెప్పు? అప్పుడప్పుడు ఆ పద్మావతి నీతో పోటీ పడాలని ప్రయత్నిస్తుంది గానీ, నీ ముందు నిలబడలేక పోతోంది..." అంటూ మంజులను మునగ చెట్టు ఎక్కించే ప్రయత్నం చేసింది పంకజం. మంజుల సంబరపడిపోతూ ఉండగా...

"దీపావళి పండగ దగ్గర పడింది కదా!... ఇంకా టపాకాయలు కొనలేదా?" అంటూ అడిగింది పంకజం.

"నిన్నంతా బ్రతిమిలాడి సాయంత్రానికి పట్టుచీర కొనుక్కోగలిగాను. ఇక టపాకాయలు కొనడానికి ఎన్ని పాట్లు పడాలో!..." ఓర కంటితో ఘటికాచలాన్ని చూస్తూ చెప్పింది మంజుల.

"పోయినేడు మీరు కాల్చిన టపాకాయల శబ్దం ఇంకా కాలనీవాసుల చెవుల్లో మారుమ్రోగుతోందంటే నమ్మండి! మీ టపాకాయల మెరుపులు






చూసి... ఆ పద్మావతి కంట్లో కాకరొత్తులు పడ్డట్టు తెగ కుళ్ళుకుంది." గతానికి గరం మసాలాను దట్టించి చెప్పింది పంకజం.

"పోయినేడు టపాకాయలన్నీ మా తమ్ముడు పట్టుకొచ్చాడు పిన్ని. ఈ యేడు వాడు రావడం లేదు..." అంటూ దీనంగా ముఖం పెట్టింది మంజుల.

"మీ తమ్ముడు రాకపోతేనేం!...మన ఘటికా చలం లేడూ! మరింత ఎక్కువ టపాకాయలు కొంటాడులే!!" అంటూ మంజులకు దగ్గరగా జరిగి...

"ఆ పద్మావతి ఈ యేడు నీ కన్నా ఎక్కువ టపాసులు కాల్చి... నీ కన్నా గొప్ప దాన్నని మన కాలనీ వాసులచేత అనిపించుకుంటానని శపథం పూనిందట!!" అంటూ గుసగుసగా నసిగింది పంకజం.

"ఆవిడకు అంత అవకాశం నేనెందుకు ఇస్తాను." అంటూ ఘటికాచలం వైపు చూసింది మంజుల.

మంజుల చూపుతో రానున్న ఉపద్రవాన్ని ఊహించిన ఘటికాచలానికి పొలమారింది.


"ఏమండీ! విన్నారుగా!...ఈ యేడు కూడా మనమే కాలనీలో అందరికన్నా ఎక్కువ టపాసులు కాల్చాలి... ఆ పద్మావతి ముందు మరోసారి తల ఎత్తుకొని నిలబడాలి!!..." అంటూ భర్తపై ప్రేమను, పద్మావతిపై పంతాన్ని కలగలిపి చెప్పింది మంజుల.

పెళ్ళాం వైపు బేలగా చూస్తూ...

"పంకజంగారు నిప్పు పెట్టగానే... నువ్వు ముందూ, వెనకా ఆలోచించకుండా మందు గుండులా పేలి, మన కొంపకు మంట పెడుతున్నావు!" దీనంగా అన్నాడు ఘటికాచలం.

"అంటే ఏమిటయ్యా నీ ఉద్దేశ్యం!?... నేను మంజులకు ఉన్నదీ... లేనిది చెప్తున్నాననా?" బుంగమూతి పెట్టి... దొంగ చూపులు చూస్తూ అడిగింది పంకజం.

"మీ గురించి కాలనీవాసులందరికీ తెలుసు లెండి." కడుపులోని బాధను కక్కే ప్రయత్నం






చేశాడు ఘటికాచలం.

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం?..." ఆటంబాంబులా పేలి... పరిస్థితిని తన అరచేతిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేసింది పంకజం.

"పద్మావతి గురించి మంజులకు, మంజుల గురించి పద్మావతికి చాక చక్యంగా చాడీలు చెప్పి... ఇద్దరికీ తగువులు పెట్టి... ఆ బిగువులో ఇద్దరి దగ్గర మీకు కావలసినవన్నీ దోచుకుంటున్నారు." లక్ష్మీ టపాసులా సూటిగా, ఘాటుగా పేలాడు ఘటికాచలం.

"అదేమిటండీ!... పంకజం పిన్ని గారిని అంతలేసి మాటలంటారు?" అడ్డంగా పేలిన తారాజువ్వలా అడ్డుతగిలింది మంజుల.

"నువ్వు ముందుగా ఈ వీడియో చూడు. అన్ని విషయాలు నీకే అర్థమవు తాయి..." అంటూ...

మొబైల్ ఫోన్లో వీడియో ఓపెన్ చేశాడు ఘటికాచలం.

"వీడియోనా!? ఎవరు పంపారు దీన్ని?..." ఆశ్చర్యంగా అడిగింది మంజుల.

"ఆ పద్మావతి భర్త పరాంకుశం పంపాడు... ఇవ్వాళ ఉదయం వాళ్ళింట్లో జరిగిన సన్నివేశాన్ని వీడియో తీసాడట... నువ్వు ప్రేమించే పంకజం పిన్ని, నువ్వు ద్వేషించే పద్మావతి మధ్య జరిగిన ఆసక్తికర సంభాషణ చూడు!" అంటూ వీడియో ఆన్ చేశాడు ఘటికాచలం.

✦✦✦

వీడియోలో సన్నివేశం...

"చూసావా పద్మావతి!...ఆ మంజుల తలబిరుసు! నువ్వు పదివేలు పెట్టి పట్టుచీర కొన్నావని... అది పదిహేను వేలు పోసి చీర కొన్నది. ఆ చీరను అందరికీ చూపించుకొని తెగ సంబరపడిపోతోంది. పోయినేడు దీపావళికి మన కాలనీలో అందరికన్నా అదే ఎక్కువ టపాసులు కాల్చిం దట... ఏడాది నుండి చెప్పిందే చెప్పుకుంటూ తెగ బడాయి పోతోంది. ఈ యేడు నువ్వు దానికన్నా ఎక్కువ టపాకాయలు కాల్చాలి... నీ కీర్తి మతాబులా మిరుమిట్లు గొలపాలి... ఈ కాలనీలో నీకు మించిన వాళ్లు లేదని ఆ మంజుల నోటితోనే చెప్పించాలి. దాని పొగరు అణచాలి!" అంటూ మూతిని ముప్పైమూడు వంకర్లు తిప్పుతూ పద్మావతితో చెప్పింది పంకజం.

"పిన్నిగారు!... మీరు వచ్చినప్పుడల్లా ఆ మంజుల గురించి చాడీలు చెప్తున్నారు... ఏడాది క్రితం మేమిద్దరం స్నేహంగా ఉండేవాళ్ళం... ఇప్పుడు ఒకరికొకరు ఎదురుపడినా పక్క చూపులు చూసి తప్పుకుంటు న్నాము. దీనంతటికీ కారణం మీరే!... మా మధ్య అహాన్ని సృష్టించి, స్నేహాన్ని పోగొట్టారు. మీకేం కావాలన్నా తీసుకుని వెళ్ళండి...అంతే గానీ... ఇతరుల గురించి చాడీలు చెప్పి చిచ్చుబుడ్లు పెట్టడం మానండి." అంటూ పంకజానికి పచ్చగడ్డి పెట్టింది పద్మావతి.

✦✦✦

మంజుల ఆ వీడియో చూస్తుండగానే పంకజం అక్కడినుండి నెమ్మదిగా ఉడాయించింది.


"ఈ వీడియో నిజమేనా అండీ?" బేలగా అడిగింది మంజుల.

"పచ్చి నిజం!... ఇన్నాళ్లు ఆ పంకజం మీ ఇద్దరికీ తగువులు పెట్టి, ఇద్దరినీ విడగొట్టి, ఒకరిపై మరొకరికి చాడీలు చెప్పి... కప్పుల కొద్దీ బియ్యం, నూనె, పప్పు, ఉప్పు దోచుకుంది!..." వివరంగా చెప్పాడు ఘటికాచలం.

"ఏమిటోనండీ! ఆవిడ ఇంతకాలం అబద్ధాలు చెప్పిందంటే... నేని ప్పటికీ నమ్మలేక పోతున్నాను." ముక్కున వేలేసుకుంది మంజుల.

"ఇరుగు పొరుగుకు తగువులు పెట్టి, కడుపు నింపుకోవడం ఆవిడకు వెన్నతో పెట్టిన విద్య... అందుకే కాలనీవాసులు ఆమెకు ఫిట్టింగ్ పంకజం అని పేరు పెట్టారు. ఆవిడ సంగతి నీకు, పద్మావతికి తప్ప కాలనీ వాళ్ళందరికీ తెలుసు... ఇప్పుడు ఆ పద్మావతి కూడా తెలుసు కుని ఆవిడకు గడ్డి పెట్టింది... ఇక తెలుసుకోవాల్సింది నువ్వే!" అంటూ ఆఫీసుకు బయలుదేరాడు ఘటికాచలం.



# నవ్వులాట



గాంధీ మనోహర్, 98490 51846

## అర్జంట్ పెళ్లి

**అం**జిబాబు తను జైల్లో వుండీ చిప్ప కూడు తినాల్సి వస్తుందని కల్లో కూడా ఊహించలేదు.

తను దొంగతనం చేసో... దోపిడీ చేసో... మోసం చేసో, జైలుకు రాలేదు. పెళ్లి చేసుకున్నందుకు ఈ దుస్థితి వచ్చింది... ఇలా ఎందుకు జరిగిందో తెల్సుకోవాలంటే... కొన్నాళ్ళు వెనక్కి వెళ్ళాలి.

✦✦✦

అంజిబాబు బ్యాచ్‌లర్. వయసు నలభై పైనే వుంటుంది. కరుడుగట్టిన వివాహ ద్వేషి.

ఈ భూమ్మీద దరిద్రులు ఎవరంటే.. డబ్బు లేని వాళ్ళో, ఆరోగ్యం బాగాలేని వాళ్ళో కాదు, పెళ్లి అయిన వాళ్ళు...అని అంజిబాబు ప్రగాఢ విశ్వాసం.

అంజిబాబు పెళ్లి చేసుకోకపోవడమే కాక తన సాటి వాళ్ళను కూడా చేస్కోవద్దని చెప్తూ, పెళ్లి అంటే వెన్నులో వణుకు పుట్టించే సంఘటనలు చెప్పి ఏంతో మందిని వివాహం చేస్కోకుండా మాన్పించాడు. ఇప్పుడు కూడా అదే పని చేస్తున్నాడు.

అంజిబాబు మాటలు నమ్మి చాలా మంది పెళ్లి చేసుకోకుండా వుండిపోయారు. ఇప్పుడు తమ కష్ట సుఖాలు చెప్పుకోడానికి తోడెవ్వరూ లేకపోవడంవల్ల భరించలేని ఒంటరి తనాన్ని ఫీల్ అవుతున్నారనీ కష్టమో నష్టమో తాము అంజిబాబు చెప్పుడు మాటలు పట్టించుకోకుండా పెళ్లి చేసుకోని వుండాల్సింది అని పెళ్ళైన తన మిత్రులతో చెప్పుకుని తమ ఆవేదనను వెలిబుచ్చుతున్నారు.

ఇలా వుండగా...

అంజిబాబు ఒకరోజు పబ్‌లో కూర్చోని మందు కొడుతున్నాడు. తన పక్క టేబుల్‌లో జోష్‌స్వామి అనే ఫేమస్ జ్యోతిష్కుడు కూర్చోని వున్నాడు. తను ఆ మధ్య ఓ సినిమా హీరో పెళ్లి గురించీ... ఓ పొలిటీషియన్ ఎన్నికల్లో గెలుపు గురించి సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా జోష్యం చెప్పాడు... తర్వాత అయన చెప్పినట్టే జరిగింది. దాంతో జోష్‌స్వామికి జనాల్లో ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పిచ్చ క్రేజ్ పిచ్చిగా పెరిగిపోయింది.

జోష్‌స్వామికి మందు ఎక్కువై లేస్తే పడిపోతానేమోనని... భయంతో అలాగే కూర్చోని వున్నాడు. జాతకాలు బాగా నమ్మే అంజిబాబు పక్కనే వున్న జోష్‌స్వామి కాళ్ళకు నమస్కరించి తన జాతకం చెప్పమని చెయ్యి అందించాడు.

"చెయ్యి అక్కర్లేదు! నీ మొహం చూసి చెబుతాను!" అని కాసేపు అంజిబాబు మొహం వైపు చూసి– "నీ జాతకం మహత్తరంగా ఉంటుంది! నువ్వు సరిగ్గా రేపటి నుండి మండలం రోజుల్లో పెళ్లి గానీ చేసుకుంటే... నీకు మహారాజ యోగం పట్టుకుంటుంది. సింగిల్ సెంటెన్స్‌లో చెప్పాలంటే ముందు ముందు నువ్వు రాజ భోగం అనుభవిస్తావు!" తాగడం వల్ల మాటలు తడబడుతున్నా విషయం స్పష్టంగా చెప్పాడు జోష్‌స్వామి.

అందుకు కృతజ్ఞతగా జోష్‌స్వామి కోసం అంజిబాబు క్యాబ్ బుక్ చేశాడు.


జోష్‌స్వామి వెళ్ళబోతూ... అంతమత్తులో కూడా అంజిబాబుతో... "మండలం రోజుల్లో నీ పెళ్లి అయిపోవాలి! గుర్తుపెట్టుకో!" అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు నుండే ఏ మాత్రం ఆలశ్యం చేయకుండా అంజిబాబు తను పెళ్లి చేసుకునే ప్రయత్నాలు జోర్‌గా మొదలెట్టాడు.

కుర్రాళ్ళకే అమ్మాయిలు దొరక్క ఇబ్బందులు పడుతున్న ఈ తరుణంలో తనకి అమ్మాయిలు గానీ లేదా ఆంటీలు గానీ ఇంత తక్కువ టైంలో ఎక్కడ దొరుకుతారు? అని అంజిబాబుకు భయం పట్టుకుంది.

దాంతో తనకు తెల్సిన పెళ్ళిళ్ళ పేరయ్యలను, మ్యారేజ్ బ్యూరో వాళ్ళను కన్సల్ట్ అయి తనకి వెను వెంటనే అమ్మాయిలని వెతికి






పెట్టమని వేడుకున్నాడు. అందంగా లేక పోయినా ఫర్వాలేదు. ఏ మతమైనా, ఏ కుల మైనా నో ప్రాబ్లం. ఆడది ఐతే చాలు!' అని నొక్కి వక్కాణించాడు. అయినా అంజిబాబుని పెళ్లి చేసుకోడాని ఎలాంటి లేడీసు ముందుకు రాలేదు.

ఇంతలో అంజిబాబు లైఫులోకి ఉపద్రవం వచ్చి పడింది. అంజిబాబు బాత్రూంలో జారి పడ్డాడు. దాంతో నడుం పట్టేసింది. నడవలేని పరిస్థితి నెలకొంది.

నొప్పి తగ్గడానికి అల్లోపతి, హోమియో, ఆయుర్వేదం ఇలా అన్ని రకాల మందులు వాడేశాడు. ఎలాగైతేనేమీ పదిహేను రోజుల తర్వాత నడుము నొప్పి దారికొచ్చింది. దాంతో డే అండ్ నైట్ మళ్ళీ పెళ్ళి ప్రయత్నాల్లో మునిగి పోయాడు అంజిబాబు.

కేవలం మూడు రోజులు మిగిలి వున్నాయి. అయినా అంజిబాబును పెళ్లి చేసుకునే లేడీసె వ్వరూ దొరకలేదు. ఎదురు కట్నం ఇస్తానన్నా ఎవరూ స్పందించలేదు.

చివరికి మండలం రోజుల్లో ఒకే ఒక్క రోజు మిగిలివుంది. అప్పుడొచ్చింది అద్భుతమైన అవకాశం. పదహారేళ్ళ అమ్మాయి దొరికింది. పైగా చాలా అందంగా వుంది. అంజిబాబు ఆలశ్యంగా పెళ్లి చేసుకుంటున్నా అందమైన అమ్మాయి దొరకడం చాలా మంది డైజెస్ట్ చేసుకోలేక పోయారు. కాకపోతే ఆ అమ్మాయి నాన్న ఎదురు కట్నంగా అంజిబాబును పాతిక




లక్షలు డిమాండ్ చేశాడు. అంజిబాబు ఇప్పటి వరకు తను చేసిన సేవింగ్స్ అన్నీ డ్రా చేసి ఇచ్చేశాడు.

గుడిలో రహస్యంగా అంజిబాబు పెళ్లి జరుగుతోంది. తాళి కట్టబోతుండగా పోలీసులు రంగప్రవేశం చేసి బాల్య వివాహం చేసుకుంటు న్నాడన్న నేరం కింద అంజిబాబుని అరెస్ట్ చేసి తీసుకెళ్ళి పోయారు. పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వ్యక్తులు ఎవరో కాదు... తమని పెళ్ళికి నోచుకోనివ్వకుండా చేసిన అంజిబాబు మీద కక్ష గట్టిన శాల్తీలు.

బాల్య వివాహ చట్టం కింద అంజిబాబుకు లక్ష రూపాయల జరిమానా గానీ లేదా రెండేళ్ళ జైలు శిక్ష గానీ కోర్ట్ వారు విధించారు. వున్న డబ్బంతా ఎదురు కట్నం ఇచ్చేసిన కారణంగా జరిమానా కట్టడానికి అంజిబాబు దగ్గర చిల్లి గవ్వ కూడా లేనందువలన రెండేళ్ళ జైలుశిక్ష అనుభవించడానికే పూనుకున్నాడు.

జైల్లో కూర్చోని బాధపడుతూ వున్నాడు. ఇంతలో అంజిబాబు జైలుమేట్ పరిచయం చేసుకున్నాడు. ఆ దరిమిలా అంజిబాబు జైలుకు వచ్చిన కారణం అడిగాడు.


సిగ్గులేకుండా ఫుల్ డిటైల్స్‌తో తన లైఫ్ హిస్టరీ మొత్తం చెప్పాడు అంజిబాబు.

'ఆ జోష్‌స్వామి గాడు చెప్పిన జోస్యం వల్లే నేను కూడా ఇలా జైల్లో వుండీ చిప్ప కూడు తినాల్సిన దుస్థితి పట్టింది' అని చెప్పాడు ఆ జైలుమేట్ కన్నీళ్లు తుడుచుకుంటూ.

"ఏం జరిగింది?... జోష్‌స్వామి మీకేమి చెప్పాడు?" ఆత్రుతగా అడిగాడు అంజిబాబు.

"వద్దు! అడక్కు! వాడి మీద కోపంతో నిన్ను కొట్టి చంపినా చంపేస్తా!" అని వెళ్ళిపోయి అరుగు మీద పడుకున్నాడు.

తన జైలుమేట్‌కు జోష్ స్వామి ఏమని జాతకం చెప్పుంటాడబ్బా?' అని ఆలోచిస్తూ ఉండిపోయాడు అంజిబాబు.








# పారా చూట్

ఆర్.సి.కృష్ణస్వామి రాజు
9393662821

**ఇంటి ముందరి తిన్నె మీద కూర్చుని పాత బ్లేడుతో గోళ్ళు కత్తిరిస్తోంది కంచు కమలక్క.**

**మోకాలి నొప్పులున్న అక్కమ్మత్త కాళ్ళీడ్చుకుంటూ... గెస పోసుకుంటూ అక్కడికి వచ్చింది.**

**కత్తిరించిన గోళ్ళను పాత న్యూస్ పేపర్‌లో చుట్టి ఇంటికి దూరంగా ఉన్న దిబ్బ మీద పడేసి వచ్చింది కమలక్క.**

**"ఏమి అక్కమ్మత్తా!... రాక రాక మా ఇంటికి వచ్చినావు?" అని సాగదీస్తా అడిగింది.**

"ఏమీలేదు కమలా!... టెంకాయ నూనె ఉంటే... కొంచెం చేతిలో పోస్తావా!" అని అడిగింది.

"అయ్యో అక్కమ్మత్తా!...లేకలేక అడిగినావు చేతి బదులుగా టెంకాయ నూనె. మా ఇంట్లో టెంకాయనూనె వాడేవాళ్ళు ఎవ్వరూ లేరు. అందరం పచ్చి ఆముదం నూనె వాడేవాళ్ళమే!" అని సమాధానం ఇచ్చింది.

'ఎట్ల చేసేదబ్బా!' అని బాధగా ఇంటి దారి పట్టింది ఆరుపదుల వయసున్న అక్కమ్మత్త.

✦✦✦

ఇంటి పక్కన ఉన్న సపోటా చెట్టు కాడ కూర్చుని, వంగిపోయిన కాలి వెండి మట్టెలను సరి చేసుకుంటోంది అక్కమ్మత్త.

ఆరవతరగతి చదివే... 'శంఖు గంగన్న' కొడుకు సుబ్రహ్మణ్యం... ఊగతా ఊగతా వెళ్తున్నాడు.

"ఎక్కడికిరా సుబ్రహ్మణ్యం? అని అడిగింది అక్కమ్మత్త.

"మా అమ్మ గుడ్డలు ఉతికే సబ్బు తెమ్మంది. అందుకని అయ్యలరాజు అంగడికి పోతా ఉండాను!!" అని చెప్పాడు.

పడిశెం ముక్కు పిసుక్కుంటూ అక్కమ్మత్త "నాయనా సుబ్రహ్మణ్యం... నీకు పుణ్యం ఉంటుంది. ఈ మోకాళ్ళ నొప్పితో... అడుగుతీసి అడుగు వేయాలంటే భయంగా ఉంది. అయ్యలరాజునడిగి పారాచూట్ ఒకటి తీసుకుని రారా!!" అని చెప్పింది.

సైకిల్ ముందరి బ్రేకు వేసినట్లు సరుక్కున ఆగినాడు.

'మరి డబ్బు....?' అన్నట్లుగా చూసినాడు.

"నేను చెప్పినానని చెప్పురా! శెనిక్కాయలమ్మిన డబ్బు వచ్చిందే పాత లెక్క, కొత్త లెక్క రెండూ ఇచ్చేస్తానని నా మాటగా చెప్పు..." దబాయింపు గొంతుతో అంది.

సరేనని చెప్పి రచ్చబండ వరకు వెళ్ళినాడు.


అక్కడే కడప బండల మీద కూర్చుని పాత ఇంగ్లీషు పేపర్ హిందూని 'తిప్పించి... మళ్ళించి' చదువుతున్నాడు పొట్టబ్బ. పది ఫెయిల్ అయిన వారికి 'పోనీ పాపం' అని గవర్నమెంటు వాళ్ళు అయిదు మార్కులు కలిపితే పాస్ అయినవాడు పొట్టబ్బ.

"పారా చూట్ అంటే ఏందబ్బా?" అని అడిగినాడు సుబ్రహ్మణ్యం.

పొట్ట తడుముకుంటూ పొట్టబ్బ "అది కూడా తెలియదా? అందుకే నిన్ను ఇంగ్లీషు సినిమాలు చూడమనేది!!" అని పడీపడీ నవ్వినాడు.

స్టయిల్‌గా కుడి కాలు ఎగరేస్తూ– "పెద్ద గొడుగులాగా ఉంటుంది. ఎత్తునుంచి అవసరమైనప్పుడు విమానాల నుంచి దూకేదానికి వాడతారు. ఈ మధ్యన తెలుగు సినిమాల్లో కూడా చూపిస్తా ఉండారు... చూడ లేదా?" అని అడిగినాడు.

"ఏమోరబ్బా..." అని తల గోక్కుంటూ అయ్యలరాజు అంగడి దిక్కుగా నడిచినాడు సుబ్రహ్మణ్యం.






దారి పొడుగునా సుబ్రహ్మణ్యంకి అను మానాలే... తలంతా ఆలోచనల రంగుల రాట్నాలే. 'విమానాల్లో ఉండే పారాచూట్ అక్క మ్మత్తకు దేనికబ్బా?' అని ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు.

మళ్ళీ వెనక్కి వెళ్ళి అక్కమ్మత్తను అడుగుదా మనుకున్నాడు.

'ఇది కూడా తెలియదా!' అని వెక్కిరిస్తుందే మోనని అనుమానపడినాడు.

'ఇంటికెళ్ళి అమ్మను అడుగుదామనుకున్నాడు. ఉడుతకెందుకు ఊర్లో పెత్తనం అని తిట్టిపోస్తే? ఎందుకొచ్చిన గొడవ?... అక్కమ్మత్త చెప్పింది చేస్తే పోలా...' అనుకుంటూ అడుగులేసినాడు.

అయ్యలరాజు అంగడి కాడ జన మంటే జనం.

'ఈ రోజు ఆది వారం కదా! ఊర్లో పొట్టేలు కోసి ఉంటారు... మసాలా సామానులు కొనే దానికి వచ్చి ఉంటారు...' అనుకున్నాడు.

అంగడి ముందర క్లాస్‌మెట్ 'ప్యారిస్ లక్ష్మి' పొట్టి జామచెట్టు మాదిరి నిల బడి ఉంది. ఆమె దాయాదులెవరో మద్రాసు ప్యారిస్ కాడ కాపురం ఉండారని ఊర్లోవాళ్ళు లక్ష్మిని 'ప్యారిస్ లక్ష్మి' అని పిలవడం గుర్తొచ్చింది సుబ్రహ్మణ్యంకి.

"ఏమిరా! వచ్చేవారం పరీక్షలు కదా!... ఇంట్లో మూల కూర్చుని చదువుకోకుండా అంగడి కాడికి వచ్చినావే?" అని నిలదీసింది.

కోపంతో సుబ్రహ్మణ్యం బుగ్గలు ఎర్రబడినాయి.

'ఈ పిల్లకు భలే టెక్కు' అని మనసులో తిట్టుకున్నాడు.

"నాకేనా పరీక్షలు, నీక్కూడా ఉండాయి కదా!" అన్నాడు.

"నేను సిలబస్ ఇప్పటికే రెండుసార్లు చదివేసినాను!" అని చెప్పింది.

"నేను కూడా నాలుగుసార్లు చదివేసినానులే!" రోషంగా చెప్పినాడు.

"నాలుగుసార్లు చదివిన ముఖమేనా నీది... అయినా నూనె లేని ఒత్తి ఎగదోసినా దిగదోసినా ఒకటే కదా!" అని ఎత్తి పొడిచింది.

"నీకు మీసాలు ఒకటే తక్కువ! నోరు మూసుకుని పని చూసుకుని... పోవే!" అని ఎగిరినాడు.


జారని రవికని పైకి లాక్కొంటూ అక్కడినుంచి కదిలింది ప్యారిస్ లక్ష్మి.

అంగడి కాడ జనం పలచబడినారు.

గుడ్డలుతికే సోప్ అడిగినాడు.

"పసుపుది కావాలా? బులుగుది కావాలా?" అని ఎదురు ప్రశ్న వేసినాడు అయ్యలరాజు.

బులుగుది కావాలని తీసుకున్నాడు.






"అన్నా! అక్కమ్మత్త చెప్పింది, డబ్బు మల్ల ఇస్తుందంట. విమానాల నుంచి దూకే పారాచూట్ తీసుకుని రమ్మని చెప్పింది!"

సుబ్రహ్మణ్యం మాటలకి మెట్లు లేని నూనె బావిలో జారిపడినట్ల య్యింది అయ్యలరాజుకి.

"ఒరేయ్ సుబ్రహ్మణ్యం... విమానాన్ని ఆకాశంలో చూడటమే కానీ, నిజంగా చూసింది లేదు. అయినా నీ కంటికి నేను... నా అంగడి ఎట్లా కనిపిస్తా ఉండాయి?... ఈడ్చి కొడితే రోజుకి వెయ్యి రూపాయల వ్యాపారం జరగదు... అట్లాంటిది నోట్ల కట్టలు గుట్టలు పోస్తే కానీ కొనలేని



పారాచూట్ మాదగ్గర ఎక్కడ దొరుకుతుంది?" అని చెప్పి ముఖానికి పట్టిన చెమటనుపై గుడ్డతో తుడుచుకున్నాడు.

ఇంతలో ప్యారిస్ లక్ష్మి పరిగెత్తుకుంటూ వెనక్కి వచ్చి– "అయ్యలన్నా! పారాచూట్ అంటే టెంకాయనూనె అని మరిచినావా?... వాడంటే తిక్కలోడు... వాడు నీక్కూడా తిక్క పుట్టిస్తా ఉండాడు!" అని చెప్పి తుర్రుమంది.

అయ్యలరాజు కుడి దవడ పక్కన ఉన్న వక్కా కును ఎడమ దవడ వైపుకు తిప్పి ముసిముసి నవ్వులు నవ్వినాడు.

"ఏమి చదువులురా నాయనా మీ చదు వులు?..." అంటూ పారాచూట్ ప్యాకెట్ ఒకటి సుబ్రహ్మణ్యం చేతికి ఇచ్చినాడు.

తలకు పెట్టుకునే ఆముదం నోట్లో పోసుకు న్నట్లయ్యింది సుబ్రహ్మణ్యంకి. 'పారాచూట్ అంటే టెంకాయనూనె అని ఎట్ల మరిచినా నబ్బా!' అని తలపైన మూడు మొట్టికాయలు వేసుకున్నాడు.

✦✦✦

కుంకుడు కాయలతో తల స్నానం చేసి ఇంటి పక్కన సపోటా చెట్టు కింద కూర్చుని ఉంది అక్కమ్మత్త. పనిలో పనిగా తల వెంట్రుక లకి సాంబ్రాణి పొగ వేసుకుంటోంది.

గుర్రంలాగా 'లక్ లక్' మని... ఎగురు కుంటూ వచ్చిన సుబ్రహ్మణ్యం, పారాచూట్ ప్యాకెట్‌ను అక్కమ్మత్త చేతిలో పెట్టి నాడు.

"నా బంగారు కొండ!..." అంటూ రెండు సపోటా పండ్లు సుబ్రహ్మణ్యం చేతిలో పెట్టింది.

"ఇక్కడే తినేసి, నోరూ చేతులు కదు క్కుని పో నాయనా!!" అని చెప్పింది.




'అయ్యలరాజు తిడితే తిట్టినాడు కానీ... తియ్యతియ్యటి సపోటాలు దొరికినాయి నాకు.' అనుకున్నాడు.

'గింజలు లేని పండ్లైతే మరింత బాగుండు' అనుకుంటూ గబగబా తినేసినాడు.

పక్కనున్న తొట్టె నీళ్ళతో చేతులు కదు క్కుంటూ... సపోటా చెట్టును చూస్తూ–

"అక్కమ్మత్తా... ఏదైనా పని ఉంటే ఏ వేళైనా ఫర్వాలేదు. ఎవరితోనైనా చెప్పి పంపు. క్షణాల్లో వచ్చి వాలుతాను!" అన్నాడు.


"నిండు నూరేళ్ళు వర్ధిల్లు నాయనా!" అని దీవించింది అక్కమ్మత్త.

అప్పుడే...

చిమ్కీల చీర కట్టిన చంద్రక్క పైట కొంగున మల్లెపూలు పోసుకుని, మాల కట్టాలని తెల్ల దారం కోసం అక్కడికి వచ్చింది.

సుబ్రహ్మణ్యం తెచ్చి ఇచ్చిన పారాచూట్ ప్యాకెట్ చూసి ఆశ్చర్యపోయింది.

"అక్కమ్మత్తా!... నువ్వు తలకు నూనె పెట్టి చాలా ఏండ్లు అయ్యింది కదా... మనం దక్షి ణాది తీర్థయాత్రకు పోయినప్పుడు... కేరళకి పోతిమి కదా! అక్కడ గురువాయూర్ గుడికాడ మూడు మూరల జడ వేసిన కేరళ కుట్టి నీకు పరిచయమయ్యింది... సినిమాల్లో గ్రూప్






డ్యాన్సుల్లో నటిస్తానని రెండు ఫోటోలు కూడా చూపింది. ఆ రోజు ఆమె పొడుగాటి జడని కన్నార్పకుండా చూస్తూ... రహస్యమేమిటని అడిగినావు.

'రోజూ తలస్నానం చేస్తాను. ఎప్పుడోగానీ తలకు నూనె రాయనని' జడని ముందుకీ, వెనక్కీ వేసుకుంటూ చెప్పింది.

ఆమె నిండు వెంట్రుకల తలకి కారణం 'తలస్నానం' అని నమ్మినావు. ఆ రోజునుంచీ తెల్లార్తో... సాయంత్రం తలస్నానం చేసేది మొదలుపెట్టినావు. ఆమె మాదిరిగానే తలకి నూనె పెట్టేది తగ్గించినావు. పండగకో పబ్బానికో కానీ తలకు నూనె పెట్టడం లేదు... ఇప్పట్లో అలాంటి వేడుక ఏమీ లేదు. అయినా ఈ రోజు కొత్తగా సుబ్రహ్మణ్యం చేత పారాచూట్ ప్యాకెట్ ఎందుకు తెప్పించుకున్నావు?" అని అమాయకంగా అడిగింది.

ఆరిపోయిన తల వెంట్రుకల్ని ముడి వేస్తూ అక్కమ్మత్త–"అది తలకు పెట్టుకోడానికి కాదు చంద్రా!" అని బదులు చెప్పింది అక్కమ్మత్త.


"ఇంకెందుకు?" అని అడిగింది చంద్రక్క.

"అయినా నీకు తెలియనిదేముంది చంద్రా! పెళ్ళిళ్ళ సీజన్ ప్రారంభమయ్యింది. ఊర్లో వాళ్ళు, దూరపు దాయాదులు వచ్చి పెండ్లి పత్రికలు ఇచ్చి వెళ్తుంటారు. మన పంచాయితీలో నిండు పెద్ద ముత్తయిదువను కదా నేను.

## ఈ నెల 'దినం'

### ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం-అక్టోబర్,10






వచ్చినోళ్ళందరూ కాళ్ళకు దండం పెడుతారు. ఆశీర్వాదం అడుగుతారు... వాళ్ళు నా కాళ్ళకి దండం పెట్టేటప్పుడు నా కాళ్ళు చూడ ముచ్చటగా ఉండాలి కదా!... అందుకే పెళ్ళిళ్ళ సీజన్ వస్తే కాళ్ళకి కొబ్బరి నూనె రాస్తాను!..." అని చెప్పింది.

అదే సమయంలో... ఇంటి ముందర కారు బ్రేకులేసిన శబ్దం వచ్చింది.

ముగ్గురూ తల తిప్పి చూసినారు.

కారులోనుంచి పట్టుచీర కట్టిన పక్క ఊరు రాసపల్లి రజిని, మొగుడితో పాటు నవ్వుతూ దిగింది. కొడుకు పెండ్లి పత్రికలు వారి చేతిలో ధగధగా మెరుస్తున్నాయి.

ఎలాగోలా అరచేతిలో నూనె పోసుకుని కాళ్ళకు సరసరా రాసింది.

'ఆఁ!' అని నోరు తెరిచిన చంద్ర క్కకి, తనకి తెలియకనే కొంగులోని మల్లెపూలు జలజలా రాలాయి. అవి అక్కమ్మత్త కురులసిరులపై పడినాయి.

కళ్ళు పెద్దవి చేసి చూస్తున్న... సుబ్రహ్మణ్యం మనసు పారాచూట్‌లాగా ఆకాశంలో రివ్వురివ్వున ఎగరసాగింది.






# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## లవ్ టాస్క్

**"వెనక్కి వెళదాం అన్నావ్ సరే... కానీ ఇప్పుడది సాధ్యమవుతుందని నువ్వు అనుకుంటున్నావా? ఆచరణలో అసాధ్యమేమో అనిపిస్తోంది నాకు." అని మధు అనీ అనగానే... లలిత గదిలో ఒక మూలకెళ్ళి, గోడ వైపుకి తిరిగి కూర్చుని... 'వ్వా' అంటూ కళ్ళ నీళ్లు పెట్టుకుంది.**

అది చూసిన మధు తత్తరబిత్తరైపోతూ...

"సరే...సరే! సైరన్ ఆపేయ్! ఆ కన్నీళ్ళ కొళాయ్ కట్టేయ్. నేను ఒప్పుకుంటున్నాను... వెనక్కి వెళదాం. నువ్వు జీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్నావ్. కానీ మన పెళ్ళి పీటలెక్కకపోతే, మీ పెద్దాళ్ళు స్టూళ్ళెక్కి ఉరేసుకుంటానంటే నువ్ ఉసూరుమంటూనే 'ఊ' అన్నావ్. అది సరే, కానీ పెళ్ళైన రెండు నెలల తర్వాత, ఇప్పుడు వెనక్కి వెళ్లి మళ్ళీ నిన్ను ప్రేమించి, ఆ ప్రేమలో నిన్ను పీకల దాకా దించి... ఇదంతా సాధ్యమేనంటావా?..." ఆవదం తాగిన మొహంతో అడిగాడు.

"ఎందుకు సాధ్యపడదు?!... భార్య అయిపోతే ఇక అంతేనా?... ఆమెని ప్రేమించి... ఆమె మనసు గెలిచి తన దానిని చేసుకుంటేనే కదా అసలు విజయం. ఒకవేళ నువ్వు నేను మెచ్చేలా నన్ను ప్రేమించ లేకపోతే... నన్ను ప్రేమలోకి దింపి నీదాన్ని చేసుకోలేకపోతే, నీకు నామీద నిజమైన ప్రేమ లేనట్టే!" మళ్ళీ గోడ వైపుకి తిరిగింది లలిత.

"పెళ్లి అయిపోయిన భార్యతో మళ్లీ ప్రేమ ఏమిటి?... ఎక్కడి నుండి మొదలుపెట్టాలో ఏంటో?" తల గోక్కున్నాడు.

"సింపుల్! నేను ఆఫీస్‌కి వెళ్లేందుకు గాను బస్టాండ్‌లో... బస్సు కోసం వెయిట్ చేస్తూ ఉంటాను. నువ్వు కార్ పై, సారీ...బైక్‌పై వచ్చి పికప్ చేసుకుని... ఆఫీసులో దించడంతో మొదలుపెట్టు. అలాగే మనిద్దరం భార్యాభర్తలం అనే సంగతి నువ్వు ఇప్పటి నుండే మానసికంగా మరిచిపోవాలి. అర్థమైందా?" అడిగింది.

"సరే!" అని తల అడ్డదిడ్డంగా ఊపాడు.

ఆ మరుసటి రోజు బస్టాండ్‌కి తొమ్మిదికల్లా వెళ్ళాడు.


అప్పటికే లలిత బస్టాప్‌లో నుంచుని ఉంది.

మధుని చూస్తూనే... "ఏమిటీ ఆలస్యం?... ఇంత లేటుగానా రావడం?" అనగానే –

"ఏం చేయను!నా పనులు చేసుకుని రావాలి కదా! అందుకే ఆలస్యం అయింది!" కుక్కని కసిరినట్టు కసిరి పడేయడంతో అక్కడందరూ లలిత వంక చు,చు,చు... అంటూ జాలిగా చూసారు.

దానికి నొచ్చుకుని మరీ చిన్నబుచ్చుకున్న లలిత, మారు మాట్లాడకుండా బండి ఎక్కేసింది.

ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వస్తూనే– "నువ్వు ప్రేమించే విధానం ఇదేనా? నేను ఎందుకు లేటయిందని అడిగితే బుజ్జగించాలి... బ్రతిమాలాలి...సారీ చెప్పాలి!... అంతేగాని, అలా మనసు విరిచేసేలా కసిరేసి, కరిచేసినంత పనిచేస్తావా? బస్టాప్‌లో ఉన్న వాళ్ళు, వరదబాధితురాలి వంక చూసినంత జాలిగా చూసారు నా వంక. అయినా, భార్యే కదా, బీరువాలా ఇంట్లో పడుంటుందీ అని






లోకువ!" అంటూ మళ్ళీ ఓ మూలకెళ్లి గోడవైపు తిరిగి 'వ్వా' అంటూ ఏడవ సాగింది.

"సరే, సరే! మాటిమాటికీ అలా గోడ వైపు తలపెట్టి ఏడవకు, రేపు త్వరగా వస్తాలే. వచ్చి నిన్ను రిసీవ్ చేసుకుంటాను. ఇలాంటివి రిపీట్ చేయను. బాధపడకు!" చెప్పాడు.

"అలా కాదు! మన రిలేషన్'షిప్' మీద నీకు పదవంత సీరియస్‌నెస్ కూడా లేదనిపిస్తోంది. కనుక దీనికి ఒకటే పరిష్కారం. మనం వేర్వేరు ఇళ్లల్లో ఉండాలి, అప్పుడు నీలో సీరియస్‌నెస్ పెరుగుతుంది. లేటుగా వచ్చినా... నువ్వు వెయిట్ చేసి మరీ నన్ను పికప్ చేసుకుంటావు. నన్ను చూడకపోతే మిస్సవుతావ్, నీలో నామీద ఆకర్షణ పెచ్చు పెరుగుతుంది. ఏవంటావ్?" అడిగింది కళ్ళు తుడుచుకుంటూ.

"ఎవరికైనా తెలిస్తే మనిద్దరిని కలిపి పిచ్చాసుపత్రిలో జాయిన్ చేస్తారంటాను. మరొకసారి బాగా ఆలోచించుకోమంటాను." అని చెప్తుండగానే లలిత ఏడుపు మొహం పెట్టి గోడ వైపుకి తిరగబోయింది...

అది చూసిన మధు– "వద్దు! నువ్వు గోడ వైపుకి తిరిగి, భోరుమని ఏడవద్దు. దీనికి నేను ఒప్పుకుంటున్నాను!" అన్నాడు.

✦✦✦

మరుసటి రోజు అదే అపార్ట్‌మెంట్లో వేరే ఫ్లోర్‌లో ఫ్లాట్ అద్దెకి తీసుకున్నాడు. తన పనులు చేసుకుని లలితని పికప్ చేసుకుని ఆఫీసులో దింపడానికి బస్టాండ్‌కి వెళ్ళాడు.

కానీ ఆమె లేకపోవడంతో... గతుక్కుమన్నాడు. చుట్టుపక్కలు చూసాడు! లేదు.

ఫోన్ చేశాడు... ఫోన్‌లో ఆమె అరుస్తూ– "ఎంతసేపు వెయిట్ చేయాలి నీకోసం? నలభై నిమిషాలు వెయిట్ చేసి... ఆఫీస్‌కి ఆటోలో వచ్చేసాను!" ఫోన్ పెట్టేసింది.

కోపంతో మధు బైక్ స్టార్ట్ చేశాడు.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చిన లలిత –

"ఏంటిది! నీకు మళ్ళీ సీరియస్‌నెస్ లేదనిపిస్తోంది. వేరే ఇల్లు మార్చినా, నా భార్యే కదా ఎప్పుడు వెళితే ఏముందిలే అనే నిర్లక్ష్యం నీలో కనిపిస్తోంది. కాబట్టి దీనికి పరిష్కారం, డివోర్స్ తీసుకుని నీకు పూర్తిగా దూరంగా ఉంటే కానీ నీలో ఆ సీరియస్‌నెస్ కనిపించదు." చెప్పింది.

తల మీద చేయి పెట్టుకుని– "నీకేమైనా పిచ్చి గానీ పట్టిందా? ఇల్లు మార్చమన్నావు... మార్చాను. మళ్ళీ ఇదొకటా?... ఇలాంటివన్నీ వింటుంటే మెంటల్‌గా నా ఆరోగ్యం కుంటుపడుతున్నట్టు చాలా ఇబ్బందిగా ఉంది. కనుక ఇక్కడితో ఈ వెనక్కి వెళ్ళడం ఆపేసేయ్!" అసహనంగా చెప్పాడు. కాదు అరిచాడు.

"అంటే ఒక అమ్మాయి నీ జీవితంలోకి రావాలనుకున్నావే కానీ, ఆ అమ్మాయి మనసుతో, ఇష్టంతో నీకు పని లేదు... ఒక అమ్మాయి మనసు గెలుచుకోవాలనే తపాళాబిళ్ళంత తపన లేదు. కనీసం ఇది కూడా చేయలేవా?" మళ్ళీ గోడ వైపుకి తిరిగింది.

మధు మనసులో 'నా కార్ ఇ.యం.ఐ తన జీతంలోంచే కట్టొంతోందే...' క్షణం ఆలోచించి– 'ఆ...పెళ్ళైన ఆడది మొగుడ్ని వదిలి ఎక్కడికి పోతుందీ, పోయేదైతే ఎపుడో పోయేది కానీ, పెళ్ళి తర్వాత ప్రేమించమని ఎందుకు అడుక్కుంటుందీ'అనుకుని...



పైకి "సరే భగవంతుడు మీద భారం వేసి అలాగే మనం లాయర్‌ని కలిసి డివోర్స్‌కి అప్లై చేద్దాంలే. నేను నీ మనసు గెలుచుకుని సొంతం చేసుకుంటాను. ఇక ఇటు తిరుగు!" అంటూ మంచంపై వెనక్కి వాలి పడుకుండిపోయాడు.

ఓ నెల తర్వాత విడాకులు మంజూరయ్యాయి.

ఆ తర్వాతి రోజు మధు, ఆమెని బస్టాండ్లో పికప్ చేసుకుని ఆఫీస్‌లో దింపేయాలని ముక్కుతూ, మూలుగుతూ బలవంతంగా బస్టాండ్‌కి వెళ్ళాడు.

కానీ అక్కడ లలిత కనిపించలేదు, సరే ఫోన్ చేశాడు.

ఫోన్ లిఫ్ట్ చేసిన లలిత–

"ఎక్కడున్నావు?" అని అడిగింది.

"బస్‌స్టాప్ దగ్గరకి వచ్చాను. ఆఫీస్‌కి వెళ్ళిపోయావా?" అడిగాడు.

"ఆఫీస్‌కి వెళ్ళిపోవడం కాదు, నీ జీవితం లోనుంచి వెళ్ళిపోయాను!"

"మూడు నెలలు బాగానే ఉండి, విడాకులు తీసుకున్నాక ఇవాళేవిటిది హఠాత్తుగా!" అడిగాడు అసహనంగా.

"హఠాత్తుగానా?... రెండు నెలలకే రెండు వందల సంవత్సరాలకి సరిపడ విసుగూ, చిరాకూ తెప్పించావ్!... నీ నిర్లక్ష్యంతో బతుకు బండెడు భారంగా అనిపించింది. నీ నుండి విడిపోవాలని నిర్ణయించుకుని, ఆ విషయం అపుడే మీ, మా పేరెంట్స్ చెవుల్లో ఊదేసాను. మీవాళ్ళు, భర్తని కాదనడం దిద్దులు మార్చుకోవడంలా కాదూ, ఏదోటి చేసి నువ్వే వాడ్ని సరిదిద్దూ అన్నారు. దాంతో పోయిన్నెల నీకు ఈ ప్రేమ టాస్క్ ఇచ్చి ఈ నెల రోజుల్లో నిన్ను మార్చాలనుకున్నాను... నీ ప్రేమలో తడిసి ముద్దయిపోదాం అనుకున్నాను...

కానీ కనీసం పన్నీరు చల్లినట్టు కూడా నువ్ నాలుగు చుక్కల ప్రేమ చిలకరించలేదు. నీతో ఉంటే, ప్రేమ దాహంతో ఎడారిలో ఏకాకిలా జీవితాంతం అలమటించిపోతానని భయం వేసింది. ఇకపై నన్ను నన్నుగా గౌరవించీ, ప్రేమపంచే వాడితో ముందుకు వెళతాను...

అన్నట్టు ఆ కార్ ఇ.యం.ఐ నీపేరు మీదకి మార్చేసాను. వచ్చే నెల నుండీ నువ్వే కట్టు!" ఫోన్ కట్టయ్యింది.





# సుగంధ పరిమళాలు

దినవహి సత్యవతి,
9790752180

**నిర్మానుష్య కాలనీలో ముచ్చటగా మూడు వీధులూ... వీధికి 10 గడపల చొప్పున ముప్ఫై గడపలు. అందరూ ఐశ్వర్య వంతులే! వర్క్ ఫ్రం హోములతో మగంగులూ... వర్క్ ఫ్రం ఆఫీసులతో ఆడంగులూ... ఆ కాలనీ ప్రత్యేకత.**

తమ తమ భార్యామణులు, ఉదయమే రయ్యి రయ్యిమంటూ కార్లలో ఆఫీసులకి వెళ్ళిపోగానే... ఫలహారాలు కానిచ్చి, ఆఫీస్ పనికి కంప్యూటర్‌లో లాగిన్ అయ్యేలోగా, పురుష పుంగవులంతా, వారుండే వీధుల్లోని రచ్చ బెంచీల వద్ద గుమిగూడి, గుప్పు గుప్పున పొగ వదుల్తూ... ఓ గంటసేపు, ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటారు.

ఆ రోజు ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువగా ఉండడం చేత, మరికాస్త ఉదయమే లేచిన, భార్యచే వదిలేయబడ్డ, బలవంత బ్రహ్మచారి సందు, తమ వీధిలో కలకలం గమనించి, 'ఏమై ఉంటుంది చెప్మా?' అను కున్నాడు వంటింట్లో ఉప్మా చేస్తూ!

ఆత్రం ఉండబట్టలేక రెండిళ్ళవతల ఉన్న గొందుకికి ఫోన్ కొట్టాడు.

"హలో! సందూ!... ఏంట్రా ఇంత పొద్దున్నే లేపావు? ఇంచక్కా మా ఆవిడ టూరెళ్ళిందోచ్ అని సెలవు పెట్టి మరి కాసేపు హాయిగా పడుకుందామనుకుంటే..." విసుక్కు న్నాడు సదరు గొందు అనబడే వ్యక్తి.

"అబ్బబ్బ...గొందూ! నీ నిద్ర గోల ఆపి ముందు మన వీధిలో చూడు ఏదో కలకలంగా ఉంది..."

"ఒరేయ్!... ముందా గొందూ అని పిలవడం ఆపు! ఎంచక్కా గోవిందూ అని పెట్టుకుంటేనూ..." చిర్రు బుర్రు లాడాడు. "అయినా ఇంతోటి దానికీ నన్ను లేపకపోతే అదేదో నువ్వే చూడొచ్చుగా!" గొందు స్వరంలో చిరాకు స్థాయి పెరిగింది.

"అత్యవసర పన్లో ఉన్నారా! మా మంచి గొందువి కదూ!... ముందు నువ్వదేంటో తెలుసుకుని చెప్పు...ఈ ఆత్రం భరించలేక పోతున్నాను!" చెప్పి ఫోన్ కట్ చేసాడు సందు అని ముద్దుగా పిలవబడే సందేహాల్రావు.

అయిది నిమిషాలైనా అయిందో లేదో ఫోన్ మ్రోగింది.

తటాలున ఎత్తి, "చెప్పు! చెప్పు!!" అన్నాడు.


"ఏంటి నే చెప్పేదీ?... నువ్వే చెప్పాలి! ఇంకా లాగిన్ అవ్వలేదేం? ఇక్కడ పెద్ద బాసు కల్లు తాగిన కోతిలా గెంతుతున్నాడు... అందరూ ఇంటి సుఖాలు మరిగి బద్దకస్తుల్లా తయారయ్యారని... శాపనార్థాలు పెడుతూ, వర్క్ ఫ్రం హోమ్ పీకి పారేస్తానంటున్నాడు!" అవతలినుంచి చిన్న బాసు వాయింపుకి ఖంగు తిని... "ఇదిగో ఇప్పుడే చేస్తున్నా!" అంటూ ఉడికీ ఉడకని ఉప్మా మీద మూత పెట్టి, పొయ్యి కట్టి, కంప్యూటర్ ముందు కూలబడ్డాడు.

దృష్టి కంప్యూటర్ స్క్రీన్ పైన ఉన్నా మనసు మాత్రం గొందు ఫోన్ కోసం ఎదురుచూస్తోంది.

ఇంతలో ఎవరో తలుపు కొట్టిన చప్పుడైంది.

'అబ్బబ్బ ఇంత పొద్దున్నే ఎవరు తగలడ్డారో' విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీసి ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి మూర్ఛపోబోయి నిలదొక్కు కుని– "ఒరేయ్ నేన్చూస్తున్నది నిజంగా నిన్నేనా! రోజూ పది కొట్టినా గానీ లేవని నువ్వేమిటీ, ఇంత ఉదయాన్నే లేవడమేమిటీ, ఎంతో కష్ట పడి, ఇలా రెండు వీధులు దాటి నా ఇంటికి దిగబడ్డమేమిటీ?..." ఇంకా ఏదో అనబోతున్న సందుని ఆపాడు చందు.

"అబ్బ! ఆపరా నీ గోల!... ముందు నే చెప్పేది విను...మా వీధిలో ఈ మధ్యనే దిగిన ఓ వృద్ధ దంపతుల గురించి నువ్వు వినే ఉంటావుగా!"






"ఆ...ఆ... అవును వాళ్ళింటి ముందునుంచి వెళుతుంటే భలేగా సుగంధ పరిమళాలు వస్తుంటాయి... వాళ్ళేనా?"

"ఆ అక్షరాలా వాళ్ళే! నీకో విషయం తెలుసా? ఆ పెద్ద వాళ్ళింట్లో ఇవాళ పెద్ద పండగట!" ఆశ్చర్యోత్సాహాలతో చెప్పాడు.

"సరిపోయింది! ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడనీ, వాళ్ళింట్లో పండగైతే నువ్వెందుకంతలా ఎగురుతున్నావు? అయినా ఈ కబురు చెప్పడానికా బద్ధక బ్రహ్మవి ఇలా పరిగెత్తుకొచ్చావు?..." ఏదో మసాలా వార్త విందామనుకున్న!..." సందు గాలితీసేసిన బెలూన్లా చప్పబడి మళ్ళీ కంప్యూటర్ ముందు కూలబడ్డాడు.



"ఇంతకీ ఏం పండగో అడగవే మరీ?"

"నేనడక్కపోయినా నువ్వు చెప్పే తీరతావుగా! చెప్పేయ్!!"

"ఆ ఇంటి పెద్దాయన చిత్రారావుగారు ఇవాళ ప్రొద్దున్నే నీళ్ళోసుకున్నారట!"

"ఛస్! ఊరుకో వెధవ కుళ్ళు జోకులూ నువ్వూనూ!... అచ్చమైన మగ పురుషుడు నీళ్ళోసుకోవడమేమిటీ? వెర్రిగానీ పట్టిందా లేక... నిన్న రాత్రి ఎక్కింది ఇంకా దిగలేదా?" వెటకరించాడు సందు.

"మా ఆవిడ నన్నొదిలేసినప్పటినుంచీ అస్సలు మందే ముట్టుకోలేదు తెలుసా?" గర్వంగా చెప్పాడు చందు.

సందు ఏదో అనబోయేలోగా... గొందు రొప్పుతూ వచ్చాడు.

చందు చెప్పిన వార్తే చెప్పి- "నువ్వు చెప్పిన కలకలం అంతా ఈ వార్త గురించేరా సందూ!" అని... "అయినా మగాళ్ళు నీళ్ళోసుకోవడమే మిత్రా వింత కాకపోతే?" ముక్కున వేలేసుకున్నాడు.

"చూసావా వీడికీ ఈ వార్త వింతలా అనిపించింది!" అన్నాడు చందు.

"అవునురా నిజం! స్వయంగా ఆయన భార్యే ఈ విషయం అందరికీ చెప్పి... ఈ రోజుతో నా కష్టాలు తీరాయి అందట... ఆవిడలా అనడం వెనక మతలబేమిటో అర్థంకాక బుర్రలు చించుకుంటున్నారందరూ!" చెప్పాడు గొందు.

"ఇదేదో నిజంగా సస్పెన్స్‌లా ఉందే!...ఇంతకీ అసలు విషయం ఏమిటో!?..."

"అసలు విషయం నే కూపీలాగేసాగా!" చేతిలో సెల్‌ఫోన్ జేబులో పెడుతూ అన్నాడు చందు.

"అదేదో త్వరగా చెప్పేదూ!" చెవులు రిక్కించారు సందు, గొందు.

"ఆ చిత్రారావుగారికి 50-70 ఏళ్ల మధ్యలో జలగండం ఉందని ఎవడో కూసాడుట. అంతే! ఆ రోజునుంచీ ఆయన అంతా అన్నీ డ్రై వాష్! ఆవిడని కూడా నానా తిప్పలూ పెట్టేవాడట! ఇది వరకున్న కాలనీలో వీళ్ళని భరించలేక తరిమేస్తే ఇక్కడికి వచ్చారని తెలిసింది. అందుకే వాళ్ళింట్లోంచి, ఎటువంటి దుర్వాసనలూ



రాకుండా, నిత్యం అగరువత్తులు వెలిగించే ఉంచుతారట! ఇవాల్టితో ఆయనకి 70ఏళ్ళు నిండాయిట. గండం గట్టెక్కిందని, ఇన్నేళ్ళ తరవాత, ఇవాళ స్నానం చేసాడట చిత్రారావు. అదన్నమాట ఆయన నీళ్ళోసుకోవడం వెనకనున్న పరమార్థం! వాళ్ళ ఊళ్ళో స్నానం చెయ్యడాన్ని అలా అంటారని ఆ పెద్దావిడే చెప్పిందట!"

అంత క్రితమే ఫోన్‌లో తెలిసిన వాళ్ళ నుండి రాబట్టిన వృద్ధ జంట సంపూర్ణ సమాచారాన్ని ఏకరువు పెట్టాడు చందు.

"ఓర్నీ! అదా వాళ్ళింట్లోంచి వచ్చే సుంగంధ పరిమళాల వెనకనున్న చిదంబర రహస్యం!" పగలబడి నవ్వుకున్నారు సందు, గొందు, చందు!





# ఇంటింటికో చెత్తకుండీ

పోపూరి విశ్వనాథ్,
9133197111

**కుటుంబరావు ఇంటిముందు గలభాగా ఉంది.**

**మునిసిపల్ కార్మికులు వచ్చి ధర్నా చేస్తున్నారు. తమకు రోజూ పనిభారం పెరిగిపోతోందని... ప్రతిరోజూ ఎంత చెత్త తీస్తున్నా మళ్ళీ పొద్దున్నే కుళ్ళిపోయిన కూరగాయలు, పళ్ళు తీయలేక చచ్చిపోతున్నామనీ... ఇప్పుడు రెడ్‌హేండెడ్‌గా పట్టుకున్నామని గొడవ చేస్తున్నారు. సాక్ష్యాలుగా మూడు నాలుగు కుక్కల్ని కూడా చూపిస్తున్నారు!**

ఎవరు ఉప్పందించారో కానీ, కాసేపటికి ఇద్దరు పోలీసులు కూడా వచ్చారు. ఇదంతా చోద్యం చూడటానికి ఆ కాలనీవాళ్ళు కొందరు గుమి గూడారుకూడా!

ఇంతకీ అప్పుడు సమయం పొద్దున ఆరున్నర దాటింది అంతే!

విషయమేమిటంటే కుటుంబరావుగారి ఇంట్లోంచి మిలిటరీ సైనికుల్లాగా, ఉన్న వారి పిల్లలిద్దరూ ఇంట్లోని చెత్తను భారీగా తోడి దగ్గరలో ఉన్న కూడలిలో ఒకవైపు నెమ్మదిగా పోసేసి వస్తున్నారు. ఈ పని తెల్లవారుజామున అయిదింటికే మొదలుపెట్టారు. రెండు మూడు రౌండ్లు అయినాయి కూడా. ఇంకో రౌండుతో మొత్తం పూర్తవుతుందనగా తెల్లవారుజాము కావడం వలన మసక వెలుతురులో ఒక కుక్కమీద కాలువేయబోయిన కుటుంబరావు చిన్నకొడుకు తృటిలో తప్పించి పక్కకు వేశాడు.

అప్పటికే గుర్రుగా చూస్తున్న ఆ కుక్కల కుటుంబం ఒక్కసారిగా మొరిగి వీరిమీదికి లంఘించాయి.

ఆ హడావిడిలో ఇద్దరూ కలిసి మోసుకెళుతున్న బకెట్టు కిందపడి పగిలింది... పదార్థం కారిపోతోంది. అయినాసరే పట్టువదలని విక్రమార్కులలాగా అలాగే వెళ్ళి తెల్లారేలోపు అది కూడా పోసి వచ్చేసి... చేతులు దులుపుకుందామనుకున్నారు.


అయితే పగిలిన బకెట్టులోంచి కారిన ఎర్రని రక్తంలాంటి పదార్థం కూడలి దాకా దారిలాగ పడింది. మిగిలింది అక్కడ పోసేసి వాళ్ళిద్దరూ ఇంటికివచ్చి మళ్ళీ పడుకున్నారు... ఆ తరువాత అరగంటకి ఈ మునిసిపాల్టీ వాళ్ళ గొడవ... తరువాత కాలనీవాళ్ళు, తదనంతరం పోలీసుల రాక.

అసలు జరిగిందేమిటంటే... కుటుంబరావు భార్య సరస్వతమ్మ కనిపించినవి కనిపించినట్టు కొనడం అలవాటు చేసుకుంది. ఇదంతా ఆ కాలనీలోని అమ్మలక్కల సహవాసం, సహకారం, సలహాలతోనే !

ఒక ఫ్రిజ్ సరిపోవట్లేదని ఎవరో మరో ఫ్రిజ్ కొన్నారట... వెంటనే మన సరస్వతమ్మ కూడా ఉన్నదానికంటే పెద్దదైన మరో ఫ్రిజ్ కొని ఒకింత దర్పంతో మురిసిపోతూ కాలనీలోని అందరినీ పిలిచి పేరంటం లాంటిది చేసి లలితాసహస్రనామ పారాయణ కూడా చేసి భోయనాలు పెట్టి వాయనాలు కూడా అందించింది.

ఇక అప్పటినుంచి ఆ రెండు ఫ్రిజ్జులని నిండుగా చూసుకుంటూ పొంగిపోతోంది. పనిమీద ఊరికి పొలిమేరలో ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్ళినప్పుడల్లా ఆ పక్కనే ఉన్న పొలంలోకి జొరబడి... అన్ని రకాల ఆకుకూరలు ఒక్కక్కటీ పది కట్టలకి తక్కువకాకుండా కొంటుంది. ఇంటికి వచ్చి ఆ ఫ్రిజ్జులలో కూరుతుంది. హైటెక్ సిటీలో కొత్తగా 'లాలా' మాల్ పెట్టగా,అక్కడికికూడా వెళ్ళి రకరకాల కొత్త కొత్త కూరగాయలు, పళ్ళు... విదేశాలనించి దిగుమతి చేసుకున్న ఎండుపళ్ళు (డ్రైఫ్రూట్స్) మొదలైనవన్నీ తన ప్రియనేస్తమైన కామేశ్వరితో కలిసి ఆ





లగేజీతో కుటుంబరావు అఫీసునుంచి వచ్చేలోపు ఆటోలో తెచ్చి వాటిని కూడా ఫ్రిజ్జులలో కూరుతుంది.

ఇలా ఎన్నో సూపర్ బజార్లు, మాళ్ళు, సంతలూ తిరుగుతూంటుంది. ఇక కొన్నాళ్ళకి ఆ కాయగూరలు, పళ్ళు, ఆకుకూరలూ కుళ్ళి కృశించి ఫ్రిజ్జులు తెరిస్తే కంపుకొడతాయి. చెత్తకోసం ఇంటికివచ్చే బండీవాడు ఒకోసారి రెండొందలు అడుగుతున్నాడు, అందుకని తిట్టుకుంటూనే అప్పుడప్పుడూ, కుటుంబరావుకి తెలియకుండా... కొడుకులచేత వీధి చివర పారేయిస్తూ ఉంటుంది తెల్లవారకుండానే.

ఆ కాలనీలో చాలా 'సరస్వతమ్మలు' అదే పని చేస్తున్నారు... ఆ విధంగా ప్రతి ఇంట్లోనూ ఫ్రిజ్జి రూపంలో ఒకో 'చెత్తకుండీ' పురుడు పోసుకుంది. కొందరైతే వండి తినగా మిగిలిన పప్పులు, పులుసులు, కూరలు వగైరాకూడా పెట్టేస్తారు. కూరలూ పళ్ళూ పాడుకాకముందే ఆవులు మొదలైన జంతుజాలానికి వేస్తే కనీసం అవైనా తిని కొద్దోగొప్పో పుణ్యమైనా వస్తుందనే ఆలోచనకూడా ఏ 'సరస్వతమ్మకీ' రాలేదు!



ఇక చీరలు, దుప్పట్లూ (అదేనండీ బెడ్‌షీట్లు, ఇప్పుడు భాష మారిపోయిందిగా) సరేసరి. మన సరస్వతమ్మ ఈ బట్టలకోసం భాగ్యనగరం లోని కొత్త కొత్త ప్రదేశాలన్నీ వదలకుండా దర్శించి (వీలుంటే ప్రారంభించిన రోజే) కొనేస్తూ ఉంటుంది.

'విఘ్నేశా సిల్క్స్', 'సావిత్రిరెడ్డి', 'మెస్సమ్మ', 'సుప్రశాంతి', 'శ్రీరంగ వర్ష' మొదలైన షాపులన్నీ పాతవైపోయి కొత్తవాటికోసం ఎప్పుడూ 'యూట్యూబులు' చూస్తూనే ఉంటుంది. ఇవి కాక ఆన్లైన్లో కొనేవి వేరు. వాటికి నాలుగు బీరువాలుకూడా చాలక బాక్స్ మంచాలు, దీవాన్లు కొని వాటిలోకూడా నింపేసింది. ఇక అవికూడా నిండిపోయి ఖాళీ అట్టపెట్టెలు కొనిపించి కలరా ఉండలు వేసి అటకలపైకి ఎక్కిస్తోంది కూడా.

ఇక స్టీలు సామాను సంగతి సరేసరి... దశాబ్దాలుగా ఊరెడు స్టీలు సామాను సమకూర్చుకుంది మన సరస్వతమ్మ. ఇంకా కొంటూనే ఉంటుంది.


"రిటైరయిన తరువాత చిన్న సైజు 'షామియానా కొట్టు' పెట్టుకుంటాను" అని భార్యమీద వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ ఉంటాడు కుటుంబరావు. ఇవేకాక ఇత్తడి, కంచు సామాను, మట్టిపాత్రలు, వన్ గ్రాం గోల్డు వస్తువుల కోసం వేటాడుతూ ఉంటుంది. అది మరో పెద్ద కథ. దాని సంగతి తరువాత చూద్దాం.

ఇక మళ్ళీ మన ప్రస్తుత కథలోకి వస్తే...


ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెట్టుకుంటున్నారుగా! మన సరస్వతమ్మ కొడుకులచేత కూడా కాయగూరలూ, పళ్ళు ఆర్డర్ పెట్టించి కొని తెప్పించుకొని మరీ ఫ్రిజ్జులు నింపుకుంటొంది... ఇవన్నీ చేశాక ఎప్పుడో స్నానం చేసి ఓపిక చచ్చి లంచ్‌కి పక్కనున్న శ్రీముఖ కాటరర్స్ నుంచి పప్పు, కూర, పచ్చడి మొదలైనవి తెప్పించి అన్నంవండుకుని, వారానికి నాలుగుసార్లు లాగించేస్తోంది.

కుటుంబరావుకు మాత్రం పొద్దున్నే ఏ ఉప్మానో ఉడకేసి పెట్టి పంపిస్తోంది. ఆయన లంచ్ ఆఫీసులో తినేస్తాడు. రాత్రికి మాత్రం ఏదో ఒకకూర తగలేసి... సారీ... తరిగేసి మమ అనిపించుకుంటోంది.

ఇక పిల్లలు ఎలాగూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు... వాళ్ళ నిద్ర, తిండి ఇప్పుడు మన చేతుల్లో లేదుగా. ఎప్పుడో రాత్రి ఒంటిగంటకో రెండింటికో పడుకుంటారు. ఆలస్యంగా లేచి స్నానం పానం అయిందో లేదో తెలీకుండా నిముషంలో ఆఫీసుకు పరిగెత్తుతారు. అదేమంటే, విపరీతమైన బిజీ అంటారు... తిండి, తిప్పలూ అక్కడే. ఏ రాత్రికో ఇంటికి చేరుకుని వెంటనే మళ్ళీ 'కాల్స్! ఆ తరువాత మీటింగ్స్'.



తలుపు కొడితే చిర్రుబుర్రులు. ప్రస్తుతం ఈ యువత మనతోపాటే ఉంటున్నా, మన లోకంలో ఉండడంలేదుగా! శని, ఆదివారాల్లో ఆ పార్టీలు... ఈ పార్టీలు...ఓలాలూ... ఊబర్లూ... అని అప్పుడప్పుడూ కనిపిస్తూ ఉంటారు. పిజ్జాలు, బర్గర్లు, పాస్తాలు, ఐస్ క్రీములు, ఆఫర్లు, స్విగ్గీ, జొమాటో అంటూ పెద్దలతో కూడా అప్పుడప్పుడూ తినిపిస్తూ బతి కేస్తున్నారు. ఇక పెద్దవాళ్ళుకూడా మింగాలేక, కక్కాలేక, బయటికి చెప్పుకోలేక నోరుమూసు కుని భరిస్తూ, ఎంత త్వరగా పెళ్ళిళ్ళు చేసేసి బాధ్యత తీర్చేసుకుందామనే విరక్తి భావానికొ చ్చేస్తునారు!





ఇది నేటి ఇంటింటి రామాయణం.

ఆమధ్యనే కుటుంబరావు పెద్దకొడుకు ప్రాజెక్ట్ పని మీద అమెరికా వెళ్ళాడు. ఏడాది అన్నారు కానీ మరో రెండుమూడేళ్ళు కూడా పట్టచ్చనీ, ఇహ అది అయ్యేసరికి అక్కడే మరో కంపెనీలో ప్రయత్నం చెయ్యాలనీ(అతని మిత్ర బృంద సలహాలతో) అనుకుంటున్నాడు.

అందుకనే సంబంధాలు కూడా చూడడం మొదలుపెట్టారు. మూడునాలుగు జాతకాలు, ఫోటోలు నప్పినవి, నచ్చినవి చూశాక అతనికి చెప్పగా ఒక పదిహేనురోజులకోసం వచ్చాడు. అది వేసవికాలం. అంటే మనకు ఊరగాయల కాలం (మరీ ముఖ్యంగా,ఆవకాయ, మాగాయ వగైరా ఊరగాయలతో పాటు మామిడి పళ్ళ కాలం)

ఇక మన సరస్వతమ్మకి ఊరగాయల పిచ్చి. ప్రతి సంవత్సరం అన్ని రకాల మామిడికాయలు తెప్పించి ఆవగాయ, మాగాయ, పెసరావకాయ, మెంతిగాయ, నువ్వుఆవకాయ, బెల్లం ఆవకాయ, కాయావకాయ, తొక్కుపచ్చడి వగైరా వగైరా పెడుతుంది. ప్రస్తుతం 'ఆర్గానిక్' కాలం కూడా కదా! డబ్బులెక్కువైనా పై రకాలన్నీ తెప్పించి ఊరగాయలు పెట్టడమే పని. ముక్కలు కొట్టడానికి... మన కుటుంబరావు రెక్కలు ముక్కలు చేసుకోవలసిందే... ఎందుకంటే బయట ముక్కలు కొట్టిస్తే కడిగి, తుడిచి ఆర కుండా కొడతారనీ, నిలవ ఉండడానికీ, రుచి, శుచి కోసం, కుటుంబరావుచేతే కుటీర పరిశ్రమ చేయిస్తూ ఉంటుంది. (ఈ విషయంలో పిల్లలు దాదాపు సహకరించరు... వారికి టైం ఉండదుగా!) ముక్కలు కొట్టడానికి 'గుడివాడ' నుంచి ఆవకాయ కత్తిపీట కూడ తెప్పించు కుంది. అయితే..ఏ ఏటికాయేడాది కొత్తగా ఊరగాయలు పెట్టాలి కాబట్టి కనీసం రెండేళ్ళ క్రితం పచ్చళ్ళన్నీ మిగిలినవి... అలాగే ఉంటాయి. పాతవి మొత్తం తినలేరు, అలాగని ఎవ్వరికీ ఇవ్వరు. ఆ చర్చ వచ్చిన ప్రతిసారీ, రేపో మాపో పిల్లాడి పెళ్ళి కుదిరితే కావద్దూ అంటుంది సరస్వతమ్మ.


అలా ఏళ్ళు గడిచి, పాత పచ్చళ్ళు పెరిగి, మురిగి, ఉప్పురిసి పాడై పోయినాయి కూడా కొన్ని.












ఇక కొన్నాళ్ళకి సర్వస్వతమ్మకి జ్ఞానోదయమైంది.

కొత్తవి పెట్టలంటే జాడీలు, సీసాలు కావాలిగా! అందుకు రెండు మూడేళ్ళు దాటిన పాత ఊరగాయలని పనిమనిషి మంగకి ఇస్తాననగా, కుటుంబరావు–

"అవి తిని దానికి ఏమైనా అయితే నువ్వు జైలు పాలవుతావని" నానా తిట్లు తిట్టి పాతవన్నీ పారేయమన్నాడు.

సరేనన్న సరస్వతమ్మ ఒకరోజు మంగచేత పాత పచ్చళ్ళని ఒక్కొక్కటీ జాడీలు, సీసాలలోంచి తీయిస్తుంటే... ఆ ఘాటుకి మంగకి ఉక్కిరిబిక్కిరై కళ్ళు తేలేసింది.


భయపడిన సరస్వతమ్మ వెంటనే అందుబాటులో ఉన్న చిన్నకొడుకుతో చెప్పి మంగను డాక్టరుదగ్గరకు పంపింది.

మంగని చూసిన డాక్టరు టెస్టులన్నీ చేసి మరేం ప్రమాదం లేదని మందులు రాసాడు.

అయితే మంగ అప్పుడే కడుపుతో ఉన్న విషయం కూడా తెలియగా...ఏకంగా ప్రసవం అయ్యేదాకా మందులు, బలం టానిక్కులు కూడా కొనిపించేసుకున్నాడు మంగ మొగుడు!

కిక్కురుమనకుండా ఆ డబ్బంతా కట్టింది సరస్వతమ్మ.

ఇక లాభం లేదని అన్నదమ్ములిద్దరూ... (కరోనా కోసం కొన్న మాస్కులు ధరించి) ఆ 'చెత్తకుండీల'లోనుంచి... అదేనండీ ఫ్రిజ్జుల లోంచి తీసిన కుళ్ళు కూరగాయలు, పళ్ళతో పాటు చివరిగా పాడైపోయిన ఆ ఊరగాయలని తీసుకెళుతున్న బకెట్ కుక్కల గోల వలన కిందపడి పగిలిపోయింది.



ఆ తర్వాత కథ తెలిసిందేగా...

పచ్చళ్ళ నుంచి... కారిన ఎర్రటి నూనె గుర్తులు, మున్సిపాలిటీ వాళ్ళ ధర్నా, కాలనీ వాళ్ళ హడావిడి, పోలీసుల రాక! ఇక చేసేదేమీ లేక కుటుంబరావు మున్సిపాల్టీవాళ్ళకి, పోలీసులకి, తలో వెయ్యిరూపాయలు ఇచ్చి నమస్కారంపెట్టి పంపించేశాడు.

ఆ దెబ్బకి ఆ కాలనీలోని ఇతర 'సరస్వతమ్మలు' కూడా నెమ్మదిగా జారుకున్నారు.

ఆ తరువాత రెండురోజులు ఇల్లంతా స్మశాన నిశ్శబ్దం.

ముందు మంగమ్మ హడావిడి, తరువాత మునిసిపాలిటీవాళ్ళ గోలతో సరస్వతమ్మకి దిమ్మదిరిగి– 'అతిసర్వత్రవర్జయేత్' అనీ, లేకపోతే 'అనర్థదాయకం' అని తెలుసుకుని అదనంగా కొన్న ఫ్రిజ్జిని అమ్మించేసింది. పాత ఊరగాయలని ఏడాదిలోపలే అందరికీ పంచేస్తోంది. కూరలైనా, పళ్ళైనా, బట్టలైనా, వస్తువులైనా అవసరం మేరకు మాత్రమే కొంటోంది. ఒకవేళ ఎక్కువ మిగిలితే అవి పాడైపోకముందే ఆవులూ మొదలైనవాటికి సమర్పిస్తోంది.

ఇక సరస్వతమ్మతోపాటు కాలనీ వాసులంతా కూడా ఒకే ఫ్రిజ్జుని పెట్టుకుని దాన్ని 'చెత్తకుండీ'లాగా కాకుండా 'ఫ్రిజ్'లాగా వాడుకుంటున్నారు.



# ముల్లుని ముల్లుతో...

వీరేశ్వర రావు మూల,
9494746228

**"ఏమండీ!" అని పొలికేక పెట్టింది మాలతి టీవి చూస్తూ.**

**"ఏదో భూకంపం వచ్చినట్టు ఆ గావు కేకలేమిటే?!..." అడిగాడు భర్త ఆనందరావు.**

**"నాకు టీవి సీరియల్స్ పోలేరమ్మ కల్యాణం, పారిపోదాం రా, లొల్లి, మానవి పోరాటం కనిపించడం లేదు. కంటికేదో సమస్య వచ్చినట్టుంది. రండి కంటి డాక్టర్ దగ్గరికి పోదాం!" అంది మాలతి.**

**"హమ్మయ్య! పీడా పోయింది. ప్రశాంతంగా ఉండచ్చు!" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.**

ఆనంద్, మాలతి ఇద్దరూ ప్రైవేట్ కంపెనీలలో పనిచేసి పదవీ విరమణ చేసారు. ఆర్థిక సమస్యలు లేవు.

"నన్ను డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళకపోతే కాఫీలో పంచదార బదులు ఉప్పు ఉంటుంది." బెదిరించింది మాలతి.

"సరే... సరే..." అన్నాడు ఆనంద్.

✦✦✦

అంతర్నేత్ర సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్‌కి వెళ్ళారు ఆనంద్, మాలతి.

డాక్టర్ నయనానందం, మాలతి కళ్ళని పరీక్షించి, "మేడమ్‌గారి కళ్ళకి లేజర్ ట్రీట్‌మెంట్ చేయించాలి!" అన్నాడు.



"ఏం మామూలు చికిత్స కుదరదా?" అడిగాడు ఆనంద్.

"ఏమిటనుకున్నారు? మేడమ్‌గారికి ముసలి అద్దాలు అమరుస్తానా? లేజర్ ట్రీట్‌మెంట్‌తో ఆవిడ వయస్సు పదేళ్ళు వెనక్కి వెళ్ళి యంగ్‌గా కనిపిస్తారు." అని నయనానందం తన మార్కెటింగ్ స్కిల్స్ బయట పెట్టాడు.

మాలతి కళ్ళకి లేజర్ ట్రీట్‌మెంట్ జరిగింది.

"వాడు నీకు లేజర్ ట్రీట్‌మెంట్ కాదే, నా బ్యాంక్‌బాలెన్స్‌కి రేజర్ ట్రీట్‌మెంట్ చేసాడే!" అని ఆనంద్ గొణుక్కున్నాడు.

తరువాత ఇన్సూరెన్స్ డబ్బుల కోసం తిప్పలు పడ్డాడు.

✦✦✦

మాలతికి చూపు బాగయ్యింది. కాని ఆనంద్‌కి కొత్త సమస్య ఎదురయ్యింది.

ఆ రోజు బజారు నుండి వచ్చిన ఆనంద్ చొక్కా తడిమి, చొక్కా మీద నున్న నల్లని వెంట్రుక తీసి– "ఎవర్తది?" అని ఆరా తీసింది.

"ఏమో నాకేం తెలుసు? సూపర్ మార్కెట్లో ఎవరి తలలోదో పడి ఉంటుంది!"

"తలలోంచి పడిందా? లేక ఆవిడ తల మీ ఒడిలో పెట్టుకున్నప్పుడు పడిందా?"


మాలతి గొడవ చేసింది. నాలుగు రోజుల తర్వాత ఆనంద్ చొక్కా మీద తెల్లని వెంట్రుక కనబడింది.

అది చూసి మాలతి– "మీ ఫ్రెండ్ నర్మద ఒడిలో సేద తీరుతున్నప్పుడు అంటుకుని ఉంటుంది!" అని రాగాలు తీసింది మాలతి.

"ఛ నోర్ముయ్! వెధవ అనుమానాలు." గద్దించాడు ఆనంద్.

కంటి ఆపరేషన్ చేసాక మెదడులో ఏదైనా సైడ్ ఎఫెక్ట్ వచ్చిందా అని ఆనంద్ అనుకున్నాడు.

అదే విషయం నయనానందంతో చర్చించాడు.



"మెదడుకి కన్నుకి సంబంధం లేదు. వృద్ధాప్యంలో కొందరికి అనుమానం జబ్బు వస్తుంది... దానంతట అదే తగ్గి పోతుంది అంతే!..." అని తేల్చాడు నయనానందం.

✦✦✦

ఆదివారం కూరలు తీసుకుని ఇంటికి వెళ్ళగానే మాలతి గుమ్మం దగ్గర ఆపి– "మీ కుడి వైపు ఎవరు? ఎడమ వైపు ఎవరు?" అడిగింది ఆనంద్‌ని.

"కుడివైపు కూరల సంచి... ఎడమ వైపు లాప్‌టాప్!" విసుగ్గా జవాబిచ్చాడు.

"కుడివైపు పచ్చని చీర కట్టుకున్న మనిషి, ఎడమవైపు ఎర్ర రంగు చీర కట్టుకున్న మనిషి, మధ్యలో మీరు... నారి నారి నడుమ మురారి లా..." అని సాగదీసింది మాలతి.

"కాదు! కుడివైపు నా శ్రార్ధం, ఎడమవైపు నా మాసికం, నీ అనుమానం తగలయ్యా!" అని తల పట్టుకున్నాడు ఆనంద్.

లోపలికి వెళ్ళాక మాలతి కాఫీ ఇస్తూ–

"మీరు మేడ మీద బట్టలు ఆరెయ్యడానికి వెళ్ళకండి. ఎదురింటి వాటాలో పూనా నుండి పూనమ్ వచ్చింది. మీరు కిందే ఉండండి."

మధ్యాహ్నం మీనా వచ్చింది లెక్కల్లో సందేహాలు తీర్చుకోవడానికి. మీనా ఇంటర్ చదువుతోంది. వాళ్ళ బ్లాక్‌లో ఉంటుంది.

"కాలిక్యులస్, న్యూక్లియస్ అంటూ పదిసార్లు రాకు!" "అని మీనాని తరిమేసింది మాలతి

✦✦✦

ఆనంద్ తన భార్య గురించి తన ఫ్రెండ్ వామనరావుకి చెప్పుకున్నాడు.

వామనరావుకి ఇతరులకి సలహా ఇవ్వడం అంటే సరదా... ఇంకేం రెచ్చి పోయాడు.

"ముల్లుని ముల్లుతో తియ్యాలి! వజ్రాన్ని వజ్రంతో కొయ్యాలి. అనుమానాన్ని అనుమానంతో ఎదుర్కోవాలి. కుజదోషాన్ని కుజదోషంతో ఎదుర్కోవాలి."

"ఇప్పుడు కుజదోషం గొడవ ఎందుకు?"

"అదా? ఫ్లోలో వచ్చింది లే! నా మాట విను. రెచ్చి పో... అంతిమ విజయం నీదే!" వామనరావు ఆనంద్ భుజం తట్టాడు.

✦✦✦

ఏప్రిల్ నెలలో మాలతి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వెళ్ళింది. అక్కడ తనతో నైన్త్, టెన్త్ చదివిన విద్యార్థులను కలుసుకుని బాగా ఆనందం పొందింది.

అక్కడ ఓల్డ్ క్లాస్‌మేట్ మే.క (మేడసాని కమలాకర్) కలిసాడు.

"నువ్వా మే.క!?" ఆనందంగా అంది మాలతి.

"మాలతీ! ముద్దుగా కమల్ అనచ్చు కదా?"


"నిన్ను కమల్ అనే ఉద్దేశం ఉంటే మే.క అని ఎందుకు పిలుస్తాను? తరువాత మే.క" ఆనాటి చెలిమి ఒక కల" పాడి అందర్నీ రంజింప చేసాడు.

✦✦✦

"పూర్వ విద్యార్థుల సమ్మేళనం బాగా ఎంజాయ్ చేసినట్టున్నావు."

"బాగా! ముఖ్యంగా మే.క వెరీ ఫన్నీ!"


"క్లాస్‌మేట్స్ అంటే ఎనర్జీ, మొగుడంటే ఎలర్జీ!" అన్నాడు ఆనంద్ వ్యంగ్యంగా!




'ఇలా తేడాగా మాట్లాడుతున్నాడేమిటీ?' అనుకుంది మాలతి.

"మే.కతో బాగా ఎంజాయ్ చేసావు కదా! లిప్‌స్టిక్, తాళ్ళ జాకెట్టుతో వెళ్ళావు... వాడి కోసమే కదా?"అని ఆనంద్ వామనరావుని అనుసరించడం మొదలు పెట్టాడు.

"ఈ రోజుల్లో అందరూ వేసుకుంటున్నారు." అంది మాలతి చిరాకుగా.




"మీ స్కూలు సంగతి నాకు తెలియదనుకోకు! స్కూలు చుట్టూ పొదలున్నాయి కదా?"

"ఉంటే!?..."

"ప్రతీ పొద ఒక కథ చెబుతుంది... మీ విరహపు సొదల గురించి..."

"ఛ! నోర్ముయ్యండి! వెధవ అనుమానం!"

'ఆ మాత్రం డోసు పడాలిలే' అని లోలోపల సంతోషించాడు ఆనంద్.

✦✦✦

ఆనంద్ మాలతిని ఏడిపించాలని తన క్లాస్‌మేట్ కమలతో క్లోజ్‌గా ఉండడం ప్రారంభించాడు. మాలతి చూస్తుండగా... కమలకి డ్రెస్ కొన్నాడు.

మాలతి తక్కువ తినలేదు.

మాలతి ఆనంద్‌ని ఏడిపించడానికి తన క్లాస్‌మేట్ బాబ్జీతో మల్టీప్లెక్స్ థియేటర్‌కి వెళ్లింది.

ఆనంద్, మాలతి ఇద్దరూ తమ క్లాస్‌మేట్స్‌తో ఒప్పందం చేసుకున్నారు నటించడానికి.

కొద్దిరోజుల తర్వాత కమల, ఆనంద్ క్రెడిట్ కార్డు ఖాళీ చేయించి సింగపూర్ చెక్కేసింది.

బాబ్జీని నటించమంటే జీవించడం మొదలు పెట్టాడు.

అతని 'అతి'కి మాలతి బెదిరి... బాబ్జీని కట్ చేసింది.

కమల చేసిన పనికి ఆనంద్‌కి తిక్క కుదిరింది అని సంతోషించింది మాలతి.

✦✦✦

ఆనంద్‌కి జర్మనీ నుండి కూతురు ఫోన్ చేసింది.

"ఎలా ఉన్నావు నాన్నా?"

"బాగానే ఉన్నా! నీ విషయాలు చెప్పు!"

"ఏముంది చెప్పడానికి?.."

ఒక్క క్షణం ఆగి...


"అమ్మని అనుమానిస్తున్నావట! నిద్రలో కూడా నీ పేరే కలవరిస్తుందే... అటువంటి అమ్మనా నువ్వు అనుమానించేది!... నీకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి పర్వతాలు,సముద్రాలు దాటి ఇండియా రావాలా?... పెళ్ళయిన ముప్ఫయి ఏళ్ళకి ఈ గోల ఏమిటి?... అమ్మని బాగా చూసుకో! మరోసారి నాకు కంప్లైంట్ రాకూడదు!" కూతురు ఆనంద్‌ని నిలదీసింది.

"నేను చూసుకుంటానులే!" అని భరోసా ఇచ్చాడు.

✦✦✦


మాలతికి కొడుకు అమెరికా నుండి ఫోన్ చేసాడు.









**ఒ**కే కార్టూన్ని పదిమంది కార్టూనిస్టులు కొద్ది మార్పులతో గీయడం జరుగుతుంది. చాలామంది అది 'కాపీ' కార్టూను కదా అనుకుంటారు. అలా అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే ఒకే ఐడియా ఇద్దరు ముగ్గురు కార్టూనిస్టులకు రావడం సహజమే! అది 'కాకతాళీయం' మాత్రమే! **కాకతాళీయంగా గీసిన కార్టూన్లకు ఉదాహరణ ఈ శీర్షిక!** ఎవరు ముందు గీసారు? ఎవరు వెనుక గీసారు? అని కాకుండా ఇద్దరు కార్టూనిస్టులు ఒకే ఐడియాని ఎలా ప్రజెంట్ చేశారో తెలియ జేయడమే ఈ శీర్షిక ఉద్దేశం!




"ఏలా ఉన్నావు రా కన్నా?"

"నేను బాగానే ఉన్నాను నువ్వేమిటి నాన్నను అనుమానిస్తున్నావు? నువ్వు ఇంట్లో ముసలి ఆడపనిమనిషిని పెట్టినా సహించి... పాత సిని మాలు చూస్తున్నప్పుడు జయమాలిని, జ్యోతి లక్ష్మి వచ్చినప్పుడు కళ్ళు మూసినా భరించిన నాన్ననా అనుమానించేది! ఇప్పుడు ఇండియా వచ్చే పరిస్థితి లేదు కానీ ఇద్దరూ కలిసి సైకా లజిస్ట్ దగ్గరికి వెడితే మంచిది." అని హితబోధ చేసి కాల్ కట్ చేసాడు.

✦✦✦

కొద్ది రోజుల తర్వాత మాలతి మెదడులో హార్మోనుల మార్పు జరిగి భర్తను అనుమానిం చినందుకు బాధపడింది.

క్షమించమని అడిగింది.

వామనరావు సలహా విని అలా ప్రవర్తించా నని ఆనంద్ కూడా క్షమించమన్నాడు.

✦✦✦

మేడసాని కమలాకర్ (మే. క) తన వివాహ వార్షికోత్సవానికి మాలతిని, ఆనంద్‌ని పిలి చాడు.

ఒకావిడ– "మీ వారు ఎక్కడ?" అని అడి గింది మాలతిని.


వేలితో చూపించింది.

ఆనంద్ టీషర్ట్‌లో... జుట్టుకి రంగేసి... యంగ్‌గా కనిపిస్తున్నాడు.

"మీ బంధువుల అబ్బాయా?"

"కాదు మా వారే!... మిగిలిపోయిన సంతూర్ ముక్కలతో ఒళ్ళు తోము కుంటారు."

"ఆఁ!"






# పదానందం 15



కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | 4 |
| | | | | 5 | | | |
| | | 6 | | | | | |
| 7 | | | | | 8 | | |
| | | 9 | 10 | | | | |
| 11 | 12 | | | | 13 | | 14 |
| | 15 | | | 16 | | | |
| 17 | | | | | | 18 | |

సమాధానం వచ్చే సంచికలో...

**ఆధారాలు:**

**అడ్డం:**


1. విసుగుతోకూడిన కోపం (3)
5. దూత (4)
6. ఒక మాదకద్రవ్యం (3)
7. ముక్క ముక్కలైంది (3)
8. ఒక విషయం పట్ల నిశ్చితాభిప్రాయం (3)
9. అటునించి వచ్చిన అభ్యర్ధన (4)
11. పిల్ల (2)
13. వ్యాపారంలో నష్టం రావడం. (3)
15. కనులువాచి ఎర్రబారే వ్యాధి (5)
17. దివికేగిన అమరగాయకుడు (2)
18. కొందరు పనులు కానివ్వడానికి ఇది పడుతుంటారు... (2)

**నిలువు**

1. అన్నింటికన్నా చిన్నవేలు (4)
2. హనుమంతుని ముందు..... అని సామెత (5)
3. 'మన' కాదు... (3)
4. పెళ్ళి (4)
8. ఒక విషయంపై పూర్తి వివరాల సమగ్ర రచన (4)
10. ఇచ్ఛ, ఇష్టం (3)
12. అసలు కాదు, ప్రతి (3)
14. పైకొచ్చిన కాపు, రక్షణ (3)
16. గురి (2)



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వా | యు | గుం | 2 డం | | 3 స | మ్మ | 4 తి |
| గు | | | 5 బా | పు | రే | | ర |
| 6 డు | ము | 7 వు | లు | | | 8 బా | కా |
| కా | | గ | | 9 ప | | | సు |
| 10 య | 11 ము | డు | | 12 డి | సి | 13 ప | |
| | దు | | | గా | | 14 ట | ఊ |
| 15 కొ | స | మె | రు | పు | | ప | |
| | లి | | | 16 లు | వా | ట | ఏ |




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# PRIYANKA PANDA
DESIGNER STUDIO



**One stop shop for your designer wear**


- Women
- Men
- Kids

## Designing & Stitching

Call: +919959222411.
email: labelpriyankapanda@gmail.com

Hasyanandam October-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC

అందరికీ దసరా, దీపావళి
శుభాకాంక్షలు



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548